# పాతబస్తీలో 'రోహింగ్యాల' కలకలం!

- సుమారు 50వేలమంది అక్రమంగా తిష్ట
- నకిలీ గుర్తింపు కార్డులతో కార్యకలాపాలు
- జీతమెంతైనా పనులకు ఆసక్తి
- జాతీయ భద్రతకు ప్రమాదమంటున్న నిపుణులు



**హైదరాబాద్,జూలై17, ప్రభాతవార్త:** ప్రభుత్వాల అనుమతులు లేకుండా అక్రమంగా రాష్ట్రాలు దాటి రోహింగ్యాలు నగరానికి చేరుతున్నారు. ఓల్డ్‌సిటీలో మకాం వేసి ఐడెంటీని సొంతం చేసుకుంటున్నారు. ఒకొక్కరు వచ్చి వేలకు పైగా తిష్టవేసి లోకల్‌గా చెప్పుకుంటూన్నారని తెలుస్తుంది. అంతేకాకుండా దౌర్జన్యాలకు పాల్పడుతూ నేరాలకు ఆజ్యం పోసి నేరాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెలుగుచూస్తున్నాయి. అంతేకాకుండా దేశపౌరులను సైతం బెదిరిస్తున్నారనే ఫిర్యాదులు లేకపోలేదు. దీంతో జాతీయ భద్రత ప్రమాదంలో పడే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. భవిష్యత్తులో ఎదరుతిరిగి దాడులకు తెగబడే ప్రవర్తన, వ్యవహారశైలీలు కనిపిస్తున్నాయని హెచ్చరిస్తున్నారు. గుర్తించి గాలింపు చర్యలు చేపట్టి ఏరిపారేయాల్సిన అవసరం పోలీసులపై ఉందని రాజకీయ పార్టీలు అభిప్రాయపడుతున్నాయి. ఇటీవల శంషాబాద్‌లో బంగ్లాదేశీయుడిని కస్టమ్స్ అధికారులకు పట్టుబడడంతో వెలుగులోకి వచ్చింది.

**బంగ్లాదేశ్, మయన్మార్‌లే అక్రమంగా...**
మయన్మార్ దేశంలో తరిమేయడంతో భారత్‌లోకి అడుగుపెడుతున్నారు. అయితే అక్రమార్కులకు భారీస్థాయిలో డబ్బులు ముట్టచెప్పడంతో రోహింగ్యాలు పశ్చిమబెంగాల్, అస్సాం రాష్ట్రాలను దాటి నగరానికి వస్తున్నారు. సీక్రెట్‌గా తలదార్చుకునేందుకు ఓల్డ్‌సిటీని ఎంచుకున్నట్లు అర్థమవుతుంది. ఇలా దశాబ్దాన్నర నుంచి హైదరాబాద్‌కు వలసలు వచ్చి సుమారు 50వేలమంది ఉన్నట్లు తెలుస్తోంది. రాచకొండ, హైదరాబాద్ కమిషనరేట్ల పరిధిలో అధికంగా ఉన్నారు. అంతేకాకుండా ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బర్త్‌డే సర్టిఫికేట్లు, బ్యాంకులావాదేవీలు ఇలా దేశపౌరసత్వం సంపాందిచేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు. సగానికిపైగా ఆధార్‌కార్డు దక్కించుకున్నారు. ఇది కూడా అక్రమార్కులతోనే నకిలీ డాక్యుమెంట్లతో సిద్ధం చేసి ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో లోకలంటూ దాడులు, దౌర్జన్యాలకు సైతం పాల్పడిన ఘటనలు చోటు చేసుకున్నాయి. ఒక దశలో ఓల్డ్‌సిటీని ఆక్రమించేందుకు పెద్ద ఎత్తున తరలివస్తున్నారనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. అంతేకాకుండా జీతం తక్కువగా ఇచ్చిన పనులను మొగ్గుచూపుతున్నారు. డబ్బులు జమ చేసి సొంత నివాసాలు ఏర్పాటు చేసుకునేందుకు ఇదొక ఎత్తుగడగా భావిస్తున్నట్లు అర్థమవుతుంది. ఇలా ఏటా వందల సంఖ్యలో పాతబస్తీలోనే మకాం వేస్తున్నారు. ముఖ్యంగా వెయ్యికి పైగా కుటుంబాలు కేవలం అధికారికంగానే నివసిస్తున్నాయి. చార్మినార్, బహదూర్‌పుర, బాలాపూర్, చింతలబస్తీ, ఫలక్‌నుమాతో పాటు ఆయా ప్రాంతాల్లో అనధికారికంగా ఉన్నారనే సమాచారం. వీరిని అదుపులోకి తీసుకోకపోతే చాలా ప్రమాదం వాటిల్లే ఆస్కారం లేకపోలేదని పలువురు పేర్కొంటున్నారు.

**డ్రగ్స్,వ్యభిచార అక్రమాలకు ఆజ్యం...**
లీగల్‌గా పనిచేస్తునట్లు నమ్మించి అక్రమాలకు ఆజ్యం పోస్తున్నారు. డ్రగ్స్,వ్యభిచారాలు, అక్రమ రవాణ, రౌడీలుగా చెలామణి అయి దేశపౌరులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలు ఫిర్యాదులు ఉన్నాయి. పోలీసులకు పట్టుబడినవారిలో బంగ్లాదేశీయులే ఉండడంతో అనుమనాలు బలపడుతున్నాయి. లోకల్ ఆధారంగా విదేశీయులకు రాకపోకలు సాగించడం డ్రగ్స్,కొకైన్‌లాంటి మత్తు పదార్థాలు తరలించి ఏజంట్లకు సరఫరా చేస్తున్నారనే విషయాలు విచారణలో కొన్ని వెలుగుచూశాయి. నేరకలాపాలల్లో సైతం వారిని నియమించుకుని వారితో అక్రమాలను చేయిస్తు న్నారని పోలీసులు భావిస్తున్నారు. అయితే వీరు తలదాచుకోవడంతో గుర్తించడంలో పోలీసులకు సవాలుగా మారింది.పశ్చిమబెంగాల్లో అక్రమార్కుడు తప్పుడు యూఎన్‌సీహెచ్‌ఆర్ శరణార్థుల గుర్తింపుకార్డులు తయారు చేస్తున్నారని పోలీసులు గుర్తించారు. తక్షణమే తరిమేయకపోతే భవిష్యత్తు ప్ర మాదంలో పడుతుందని రాజరీయవేత్తలు భావిస్తు న్నారు. పోలీసులు అనుమాన ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టి అదుపులోకి తీసుకోవాలని కోరుతున్నారు.



# హైదరాబాద్ వార్త

## ప్రజల ఆస్తులను రక్షించడమే హైడ్రా లక్ష్యం

**-హైడ్రా కమిషనర్ రంగనాథ్ -వైభవంగా హైడ్రా ప్రథమ వార్షికోత్సవ వేడుకలు**



విద్యార్థులకు బహుమతులు, జ్ఞాపికలు అందజేస్తున్న రంగనాథ్, భాస్కర్‌లు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), జూలై 19 ప్రభాతవార్త :** హైదరాబాద్ విపత్తు నిర్వహణ మరియు ఆస్తి రక్షణ సంస్థ హైడ్రా అనేది ఒక చట్టబద్ధమైన సంస్థని, ఇది నగరంలో ప్రజాస్తుల రక్షణ, విపత్తు నిర్వహణకు బాధ్యత వహిస్తుందని హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ తెలిపారు. నగరంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్, విపత్తు నిర్వహణ విభాగాన్ని పునర్వవస్థీకరించడం ద్వారా హైడ్రా 19 జూలై 2024లో ఏర్పడిందని, నేటి సంవత్సరం పూర్తిచేసుకుందని చెప్పారు. ఈ సందర్భంగా రవీంద్రభారతి ప్రధాన మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎ.వి.రంగనాథ్ ముందుగా ఇండ్‌ఫేమ్ విజువల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో సామాజిక, పర్యావరణ అంశంపై నగర పాఠశాలల విద్యార్థులచే రూపొందించిన హైడ్రా ఫోటో ఎగ్జిబిషన్‌ను సందర్శించి, వారితో ముచ్చటిస్తూ మీ భవిష్యత్తు కోసం హైడ్రా పనిచేస్తుందని, ప్రకృతికి విఘాతం కల్గించేవారిని వదిలిపెట్టమని హామీనిచ్చారు. అనంతరం రవీంద్రభారతి వేదికలో ప్రసంగిస్తూ తెలంగాణ కోర్ అర్బన్ రీజియన్, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాలతోసహా ఔటర్ రింగ్‌రోడ్ వరకు అధికార పరిధి కలిగి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధిశాఖ, తెలంగాణ ప్రభుత్వం సహకారంతో హైడ్రా ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. హైడ్రాకి మూడు విభాగాలున్నాయని, అవి ఆస్తి రక్షణ, విపత్తు నిర్వహణ, లాజిస్టిక్స్ మద్దత్తు అన్నారు. ఇది విపత్తు ప్రతిస్పందన, ఆస్తిరక్షణ, ఆక్రమణల తొలగింపు, తనిఖీ, ఇతర సంస్థలతో సమన్వయానికి బాధ్యత వహిస్తుందని, దీనిని మహాయజ్ఞంలా కొనసాగిస్తున్నామని వివరించారు. ఈ కృషిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములైనప్పుడే ముందుకెళ్లగలమన్నారు. నగర భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని చెరువులు, నందనవనాలు, రహదారులు, నాలాలు ఆక్రమణలు కాకుండా అనేక ఆటంకాలు ఎదురవుతున్నా భయపడకుండా భవిష్యత్ తరాలకు ఫలాలు అందించే ఆకుంఠిత దీక్షతో అహర్నిశలు పనిచేస్తున్నామన్నారు. హైడ్రా చర్యల వల్ల పాఠశాల పిల్లల్లో కూడా చెరువు, ఎఫ్‌టిఎల్, బఫర్ ఇలా ఎన్నో అంశాలపై అవగాహన కల్గడం ఆనందాన్ని ఇచ్చిందని చెప్పారు. హైడ్రా వార్షికోత్సవం సందర్భంగా హైడ్రా కార్యక్రమాలపైన దాస్యం గీతాభాస్కర్ నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులను, ప్రదర్శనలో వివిధ అంశాలపై అవగాహన కల్పించిన విద్యార్థులకు జ్ఞాపికలను కమిషనర్ రంగనాథ్ అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సినీదర్శకుడు తరుణ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ భారీ వర్షం....భారీగా ట్రాఫిక్ జామ్



**హైదరాబాద్,జూలై 19,ప్రభాతవార్త:** నగరంలోని పలు ప్రాంతాల్లో మళ్లీ వర్షం కురిసింది. శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకూ ముంచెత్తిన వాన శనివారం సాయంత్రం మళ్లీ మొదలైంది. పంజాగుట్ట, అమీర్‌పేట, యూసుఫ్‌గూడ, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, టోలిచౌకి, ఖైరతాబాద్, నాంపల్లి, అబిడ్స్, కోఠి, హిమాయత్‌నగర్, చిక్కడపల్లి, అంబర్‌పేట, ఉప్పల్, విద్యానగర్, నల్లకుంట, ఉస్మానియా యూనివర్సిటీ, ముషీరాబాద్, కాచిగూడ, దిల్‌సుఖ్‌నగర్, సరూర్‌నగర్, చంపాపేట్, ఎల్బీనగర్ తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. పలుచోట్ల ప్రధాన రహదారిపై భారీగా వర్షపునీరు చేరింది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. పంజాగుట్ట, నిమ్స్ వద్ద భారీగా వరదనీరు నిలిచిపోయింది.సికింద్రాబాద్ పరిధిలోని ప్యాట్నీ నాలా నుంచి పైగా కాలనీలోకి వరదనీరు ప్రవహించింది. వరదను అడ్డుకునేందుకు కంటోన్మెంట్ సిబ్బంది తాత్కాలికంగా ఇసుక బస్తాలను వేశారు. అయినా వరద ఆగడం లేదు. ఇసుక బస్తాలను కాలనీలోకి ప్రవహిస్తోంది. దీంతో పైగాకాలనీ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే పలువురిని ఎస్‌డీఆర్ఎఫ్, హైడ్రా, కంటోన్మెంట్ సిబ్బంది సురక్షిత ప్రాంతాలకు తరలించారు. నాంపల్లి, అబిడ్స్, కోఠి, సుల్తాన్‌బజార్, సైఫాబాద్, బేగంబజార్, బషీర్‌బాగ్, ఖైరతాబాద్ తదితర ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, టోలిచౌకి, ఫిలింనగర్ ఏరియాల్లో ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. మెహదీపట్నం రోడ్డులో కూడా భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనాలు నెమ్మదిగా కదిలాయి, తార్నాక-హబ్సిగూడ-నాచారం రోడ్డులోనూ ఇదే పరిస్థితి కనిపించింది. జూబ్లీహిల్స్ అపోలో రోడ్డులో ట్రాఫిక్ జామ్ కారణంగా వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో వాహనదారులు నానా తిప్పలు పడానడరు. ఒకపక్క వర్షం..మరో పక్క ట్రాఫిక్ జామ్ కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

## డెంగ్యూ నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

-స్లమ్‌లు,గృహాలు, అపార్ట్‌మెంట్‌లల్లో యాంటీలార్వా ఆపరేషన్లు
-మూసీవెంట దోమలవృద్ధి జరగకుండా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలి
-అధికారులకు జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.వి.కర్ణన్, ఏసి రఘుప్రసాద్, సిఈ సహదేవ్ రత్నాకర్ తదితరులు

**హైదరాబాద్,జూలై 19,ప్రభాతవార్త:** గ్రేటర్‌లో డెంగ్యూ ప్రబలకుండా యుద్ధప్రాతిపదికన పకడ్బందీ చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆర్ వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు శనివారం జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో హెల్త్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.స్లమ్ లతో పాటు గృహాలు, అపార్ట్మెంట్‌లకు వైద్యాధికారులు స్వయంగా వెళ్లి ప్రజా భాగస్వామ్యంతో మంచి నీరు నిల్వ ఉండి దోమల వృద్ధి చెందే ప్రదేశాలను యాంటీ లార్వా ఆపరేషన్‌లు చేపట్టాలన్నారు. డెంగ్యూ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వచ్చే వారం పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ వసతి గృహాలను సందర్శించి దోమలను వృద్ధి జరగకుండా యాంటీ లార్వా ఆపరేషన్లు చేపట్టాలని అన్నారు. ప్రభుత్వ వసతి గృహంలో ప్రతి వారం క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయాలని ఆదేశించారు. మూసి, జలాశయాలలో దోమల వృద్ధి జరగకుండా చూసేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. డిప్యూటీ కమిషనర్లు, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్లు యు పి హెచ్ దవాఖానాలను ప్రతిరోజూ సందర్శించి పరిస్థితిని సమీక్షించాలని ఆదేశించారు.అలాగే డెంగ్యూ నిర్ధారణకు ఎలిసా పరీక్ష తప్పనిసరి, జ్వర పీడితులకు డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు విరివిగా నిర్వహించాలని చెప్పారు.పాథాలజీ ల్యాబ్ రాపిడ్ పరీక్షల ద్వారా డెంగ్యూ గుర్తించడానికి వీలు కేసు తప్పనిసరిగా ల్యాబ్ లను సందర్శించాలని ఎలిసా పరీక్ష ద్వారానే డెంగ్యూ నిర్ధారణ చేయాలన్నారు. డెంగ్యూ కేసులు నమోదైన కాలనీలను వైద్యులు తప్పనిసరిగా సందర్శించి ఆ కాలనీ ప్రజల ఆరోగ్య పరిస్థితిని వాకబు చేయాలన్నారు. అనుమానితులకు విరివిగా పరీక్షలు చేయడంతో పాటు డ్రైడే యాక్టివిటీస్ తప్పనిసరిగా చేపట్టాలన్నారు. అనంతరం కమిషనర్ వారం రోజుల క్రితం నగరంలో ప్రారంభించిన రోడ్ సేఫ్టీ డ్రైవ్ పురోగతిపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. నగరంలో గుంతలు పూడ్చడం,క్యాచ్ పిట్స్, సెంట్రల్ మీడియం మరమ్మతు పై వివరాలు అడిగారు. మొత్తం 8 వేల గుంతలు గుర్తించగా 4500 గుంతలను పూడ్చివేశామనీ ఇంజనీరింగ్ అధికారులు చెప్పారు. అలాగే పెండింగ్ స్టార్మ్ వాటర్ డ్రైన్స్, వాటర్ లాగింగ్ పాయింట్స్ మరమ్మత్తు పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.నాలా సర్వే సర్కిల్ ఏఈ లు క్రియాశీలంగా వ్యవహారిస్తాయని 150 వార్డుల వారిగా సర్వే చేసేందుకు కసరత్తు జరుగుతుందన్నారు. ఈసమావేశంలో సిఈ సహదేవ్ రత్నాకర్, అదనపు కమిషనర్లు రఘు ప్రసాద్, పంకజ, గీతా రాధిక, జోనల్ కమిషనర్ లు అనురాగ్ జయంతి, అపూర్వ్ చౌహాన్, హేమంత్ కేశవ్ పాటిల్, హేమంత్ సహా దేవ్ రావు, రవి కిరణ్, వెంకన్న, సి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ పద్మజ, ఫైనాన్స్ అడ్వైజర్ శరత్ చంద్ర, జోనల్ ఎస్ ఈ లు అశోక్ రెడ్డి, చిన్న రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, శంకర్ నాయక్, ఏ ఎం అండ్ హెచ్ ఓ లు, ఎంటమాలజీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### విద్యా సంస్థల బస్సులపై పోలీసుల కొరడా..!

- హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో 17మంది డ్రైవర్లకు ఆర్టీఏ నోటీసులు

**హైదరాబాద్, జూలై 19, ప్రభాతవార్త:** విద్యార్థులను తరలించే విద్యా సంస్థల బస్సులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. బస్సు కండీషన్, డ్రైవర్లపై డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలతో నగర ట్రాఫిక్ పోలీస్ యంత్రాంగం దాడులను ఉపక్రమించింది. ఎలాంటి వారిని ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పింది. ఈ మేరకు పోలీసులు జరిపిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో కేసులతో కూడిన లిస్టును రవాణశాఖ అధికారులకు పంపించింది. దాంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న బస్సులపై కఠిన చర్యలు చేపడుతున్నారు. మద్యం మత్తులో ప్రమాదకరంగా నడిపిన 17 మంది విద్యా సంస్థల బస్సుల డ్రైవర్ల లైసెన్స్ సస్పెండ్ చేయాలని సూచించారు. హైదరాబాద్, రంగారెడ్డి పరిధిలో విద్యా సంస్థల బస్సు డ్రైవర్లు నిర్లక్షంగా డ్రైవింగ్ చేస్తూ మద్యం మత్తులో పోలీసులకు పట్టుబడుతున్న కేసులు పెరుగుతున్నాయని ,కట్టడిలో భాగంగా వారి లైసెన్స్‌లను రద్దు చేయనున్నారు. రెండేళ్లలో 1415 మంది విద్యాసంస్థల బస్సులు, స్కూల్ ఆటో డ్రైవర్ల లైసెన్స్‌లను రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

### నాలుగవ అంతస్తు నుండి దూకి విద్యార్థి ఆత్మహత్య



మృతి చెందిన రిజ్వాన్ మహమ్మద్

**మియాపూర్, జూలై 19, ప్రభాతవార్త** స్కూల్ బిల్డింగ్ నాలుగవ అంతస్తు నుండి దూకి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన దారుణ ఘటన మియాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జేఎన్టీయూ నగర్‌కు చెందిన రిజ్వాన్ మహమ్మద్ (15) మియాపూర్ మాధవి నగర్‌లో ఉన్న సెయింట్ మార్టిన్ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్నాడు. రోజులాగే శనివారం స్కూల్‌కు వెళ్లిన రిజ్వాన్ క్లాస్ రూమ్ నుండి బయటకు వచ్చి నాలుగో ఫ్లోర్ నుండి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇది గమనించిన స్కూల్ సిబ్బంది రిజ్వాన్‌ను దగ్గరలోని ఉధ్బవ ఆసుపత్రికి తరలించారు. అయితే రిజ్వాన్ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. రిజ్వాన్ ఎందుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏం జరిగింది అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

### ముగిసిన ఫిష్‌వెంకట్ అంత్యక్రియలు



ఫిష్‌వెంకట్ అంత్యక్రియలు నిర్వహించిన దృశ్యం

**హైదరాబాద్ జూలై19,ప్రభాతవార్త :** తెలుగు సినీ ఇండస్ట్రీలో తనదైన తెలంగాణ యాస, హాస్యంతో ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేసిన నటుడు ఫిష్ వెంకట్ (ముంగిలంపల్లి వెంకటేశ్), తీవ్ర అనారోగ్యంతో కన్ను మూసిన విషయం తెలిసిందే. దాదాపు వందకు పైగా చిత్రాలలో హాస్య, విలన్ పాత్రలు పోషించి గుర్తింపు తెచ్చుకున్న ఆయన శుక్రవారం రాత్రి తుది శ్వాస విడిచారు. కిడ్నీ, కాలేయ సంబంధిత సమస్యలతో పోరాడిన ఆయనకు అవయవ మార్పిడి అవసరమని వైద్యులు తెలిపారు. దీనికి దాదాపు రూ.50 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పడంతో, కుటుంబం ఆర్థిక సాయం కోసం ఎదురుచూసింది. దాతల నుంచి సరైన సాయం అందకపోవడంతో చివరకు ఆయన మృత్యువుతో పోరాడుతూ కన్నుమూశారు. ఫిష్ వెంకట్ అంత్యక్రియలు శనివారం మారేడ్‌పల్లిలోని హిందూ స్మశానవాటికలో హిందూ సంప్రదాయ పద్ధతిలో జరిగాయి. ఆయన పార్థివ దేహాన్ని సికింద్రాబాద్లోని అడ్డగుట్టలో ఉన్న ఆయన నివాసం వద్ద ఉంచారు. అభిమానుల సందర్శన అనంతరం అంతిమయాత్ర కొనసాగించింది. గబ్బర్ సింగ్ టీమ్, అభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. అయితే ఫిష్ వెంకట్ మృతిపై టాలీవుడ్ పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తామంతా ఒకే సినీ కళామతల్లి బిడ్డలం అని చెప్పుకునే వారు ఇప్పుడు కనీసం మృతదేహాన్ని చూడాడానికి కూడా రాలేరా అని ప్రశ్నిస్తున్నారు. ఫిష్ వెంకట్ అసలు పేరు ముంగిలంపల్లి వెంకటేశ్. 1971 ఆగస్టు 3న ఏపీలోని మచిలీపట్నంలో జన్మించారు. అయితే, చిన్నతనంలో హైదరాబాద్‌కు వలస వచ్చారు. ముషీరాబాద్‌లోని కూరగాయల మార్కెట్‌లో చేపలు అమ్మే వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవారు. అందుకే ఫ్యాన్స్, సహచరులు ఆయనను ఖిఫిష్ వెంకట్ అని పిలిచేవారు. కాగా, మూడవ తరగతి వరకే చదివిన వెంకట్‌కు సినిమాలంటే పిచ్చి. ఆ అపారమైన ఆసక్తితో సినిమాల్లోకి వచ్చారు. దివంగత నటుడు శ్రీహరి ద్వారా వెంకట్ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. ఆయనను దర్శకుడు వీవీ వినాయక్ సినీ ప్రపంచానికి పరిచయం చేశారు. 2002లో విడుదలైన తారక్ నటించిన ఆది మూవీలో చెప్పిన డైలాగ్ ఒక్కసారి తొడకొట్టు చిన్నా"తో ఫిష్ వెంకట్ ప్రజల మదిలో నిలిచిపోయారు. అలాగే పవన్ కల్యాణ్ నటించిన గబ్బర్ సింగ్ మూవీలో కూడా తనదైన కామెడీ టైమింగ్‌తో కితకితలు పెట్టారు. ఇలా 100కి పైగా సినిమాల్లో విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా, హాస్యనటుడిగా మెప్పించారు. తెలంగాణ యాస, విలక్షణమైన హావభావాలు, కామెడీ టైమింగ్ ఆయన నటనలో ప్రత్యేక ఆకర్షణ అని చెప్పాలి. చిన్న పాత్రల్లో కనిపించినా, ప్రేక్షకుల గుండెల్లో చిరస్థాయిగా ముద్ర వేసుకున్నారు. ఆయన మృతితో టాలీవుడ్ ఓ మంచి నటుడిని కోల్పోయింది. ఫిష్ వెంకట్ మృతిపై సినీ ప్రముఖులు, అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం తెలియజేస్తున్నారు.

## నేడే భాగ్యనగరంలో బోనాల ఉత్సవాలు

-బోనాల జాతర ఉత్సవాలు సందర్భంగా పాతనగరంలో పోలీస్ బందోబస్తు



లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళి దేవాలయం

**చార్మినార్,జూలై 19 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతనగరంలో ఈ నెల 20వ తేదీ ఆదివారం అత్యంత వైభవంగా ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలు జరగనున్నాయి. బోనాల ఉత్సవాలు సందర్భంగా లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళి దేవాలయం,హరిబౌలి శ్రీ అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయం,మీరాలం మండి శ్రీ మహంకాళేశ్వరి దేవాలయం, హరిబౌలి బంగారు మైసమ్మ దేవాలయం,సుల్తాన్‌షాహి శ్రీ జగదాంబ దేవాలయంతో పాటు ఉప్పుగూడ, గౌలిపుర,దూద్‌బౌలి,అలియాబాద్,కిషన్‌బాగ్,కసారట్ట,చాంద్రాయణగుట్ట,దేవిబాగ్, మురళీనగర్,పురానాపూల్ తదితర ప్రాంతాలలోని శ్రీ మహంకాళీ దేవాలయాలను మందిరం కమిటీల ప్రతినిధులు అందంగా అలంకరించారు. పాతబస్తీలోని దేవాలయాలు విద్యుత్ దీపాల కాంతులలో దగదగ మెరిసి పోతున్నారు.ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు అమ్మ వార్లకు అత్యంత భక్తి శ్రద్దలతో బోనంలు సమర్పించనున్నారు.ఈ నెల 13వ తేదీన పాతబస్తీలో జరిగిన సామూహిక ఘట స్థాపన ఊరేగింపు అనంతరం ఆయా ఆలయాలలో ఘట స్థాపన కార్యక్రమం జరిగింది.ప్రతీ రోజు పాతబస్తీలోని ఆలయాలలో అమ్మ వార్లకు భక్తులు ఎంతో భక్తి శ్రద్దలతో పూజలు,అర్చనలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు.లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళీ ఆలయంలో వైభవంగా ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలు కొనసాగుతున్నాయి. చారిత్రాత్మక లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళి ఆలయంలో ఆదివారం బోనాల జాతర ఉత్సవాలు వైభంగా జరగనున్నాయని ఆలయం కమిటి చైర్మన్ మారుతి యాదవ్ తెలిపారు.లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళి ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.పలువురు ప్రముఖులు ఆదివారం లాల్‌దర్వాజ సింహవాహిని శ్రీ మహంకాళి ఆలయంతో పాటు పాతబస్తీలోని ఆలయాలలో పూజలు నిర్వహించనున్నారు.ఎటువంటి ఇబ్బందులు కలగకుండ పోలీస్, జిహెచ్‌ఎంసి,జలమండలి,విద్యుత్ శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.ఈ నెల 20వ తేదీన జరగనున్న బోనాల ఉత్సవాలు సందర్భంగా దక్షిణ మండలం పాతబస్తీలో కట్టు దిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

## ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ టీచర్లను నియమించాలి



కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డితో మాట్లాడుతున్న టీచర్లు

**జీడిమెట్ల, జూలై 19, ప్రభాతవార్త**

సుభాష్ నగర్ డివిజన్ రామ్ రెడ్డి నగర్లోని ప్రభుత్వ పాఠశాలలో టీచింగ్ స్టాఫ్ కొరత ఉన్నందున ప్రైవేట్గా టీచర్లను ఏర్పాటు చేయమని కార్పొరేటర్ హేమలత సురేష్ రెడ్డిని శనివారం కలిసి కోరారు. ఈ కార్యక్రమంలో రామ్ రెడ్డి నగర్ స్కూల్ స్టాఫ్, రామ్ రెడ్డి నగర్ కాలనీ అసోసియేషన్ మెంబర్స్లు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాలకు ఎమ్మెల్యే రాజాసింగ్కు ఆహ్వానం



ఎమ్మెల్యే రాజాసింగ్ కు ఆహ్వాన పత్రికను అందిస్తున్న దేవాలయ ఛైర్మన్ గంజి రఘునాథ్.

**మెహిదీపట్నం, జూలై 19, ప్రభాతవార్త :**

కార్వాన్ కేసరి నగర్ లోని శ్రీ చల్లని మైసమ్మ బోనాల ఉత్సవాలకు రావాలంటూ దేవాలయ ఛైర్మన్ గంజి రఘునాథ్ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కు ఆహ్వాన పత్రికను అందించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం గంజి రఘునాథ్ మాట్లాడుతూ.. ఆషాడ మాస బోనాల ఉత్సవాలు కార్వాన్ నియోజకవర్గంలో అత్యంత వైభవోపేతంగా జరుగుతున్నాయని తెలిపారు. బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం రోజున ఫలహార బండి ఊరేగింపు, తొట్టెల నిమజ్జనం కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించడం జరుగుతుందని తెలిపా రు. కార్యక్రమంలో స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆహ్వానించిన వారిలో నర్సింగ్ రావు, నల్వాడ మహేష్, నల్వాడ సుచిత్, పుట్ట విగ్నేష్లు ఉన్నారు.

## అల్వాల్లో బోనాలు సందడి



పోచమ్మ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

**అల్వాల్, జూలై 19 ప్రభాతవార్త:** అల్వాల్లో బోనాలు సందడి నెలకుని ఉంది. వాడ వాడలా అమ్మవారి ఆలయాలు వద్ద పండుగ శోభ విరాజిల్లింది. శనివారం నుంచి మూడు రోజులు పాటు జరిగే ఉత్సవానికి అంకురార్పణ జరిగింది. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారి ఆలయనాలను సందర్శించడం జరిగింది. ఓల్డ్అల్వాల్ నల్ల పోచమ్మ ఆమ్మవారిని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తో పాటు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నేతలు దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలులో పాలు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో నేతలు లక్ష్మీకాంత్ రెడ్డి, నిమ్మ ఆశోక్ రెడ్డి, సూర్యకిరణ్, దేవేందర్, ఉదయ్, ప్రవీణ్, సివై రాజు ఇతరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ కార్పొరేటర్ సంజయ్ గౌడ్



సంజయ్గౌడ్ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మహేశ్కుమార్గౌడ్, అజారుద్దీన్, ఎంపి.అనిల్యాదవ్ తదితరులు

**హైదరాబాద్,జూలై 19,ప్రభాతవార్త:**

కాంగ్రెస్ మాజీ కార్పొరేట్ సంజయ్గౌడ్ కాంగ్రెస్లో చేరారు. ఈమేరకు శనివారం టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్గౌడ్, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఇంచార్జ్ మహ్మద్ అజారుద్దీన్ సమక్షంలో కాంగ్రెస్లో చేరారు.కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రతి ఒక్కరు ఆకర్షితులవుతున్నారని తెలంగాణ కాంగ్రెస్ పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ మెంబర్, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ ఇన్చార్జి మహ్మద్ అజారుద్దీన్ అన్నారు. యూసుఫ్గూడ మాజీ కార్పొరేటర్, బీజేపీ నేతగా సంజయ్ గౌడ్ రాక కాంగ్రెస్కు కలిసివస్తుందన్నారు. నియోజక వర్గంలో కీలక నేతలు మాకు టచ్లో ఉన్నారని త్వరలోనే వారంతా కాంగ్రెస్లో చేరతారని ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని అన్నారు. నియోజక వర్గంలో చాలా మంది తనకు ఫోన్లు చేస్తున్నారని త్వరలోనే బస్తీలు, కాలనీల్లో ప్రత్యేకంగా కార్యక్రమాలు పెట్టి వివిధ పార్టీల నుంచి నేతలను చేర్చుకుంటామని అన్నారు. సంజయ్ గౌడ్ మాట్లాడుతూ త్వరలోనే డివిజన్ మొత్తం పాదయాత్ర చేస్తానని ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రచారం చేస్తానని అన్నారు. అఖండ మెజార్టీతో కాంగ్రెస్ పార్టీ గెలవడం ఖాయమని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీ అనిల్కుమార్ యాదవ్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ మహ్మద్ అసదుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ఆషాఢం మహంకాళి బోనాలకు కేంద్రమంత్రి కిషన్రెడ్డికి ఆహ్వానం



మహంకాళి బోనాలకు కిషన్రెడ్డిని ఆహ్వానిస్తున్న అంబర్పేట్ దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు

**హైదరాబాద్, జూలై 19, ప్రభాతవార్త:** ఆషాఢమాస బోనాల సందర్భంగా అంబర్పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే మహంకాళి బోనాలకు రావల్సిందిగా కేంద్ర బొగ్గు గనుల శాఖామంత్రి కిషన్రెడ్డిని ఆహ్వానించారు. ఈమేరకు శుక్రవారం అంబర్పేట్ దేవస్థాన సేవాసమితి ప్రతినిధి బృందం కిషన్రెడ్డిని కలిసి, ఆహ్వాన పత్రిక అందచేశారు. ఈ కార్యక్రమంలో సమితి ప్రతినిధులు కే.దుర్గాప్రసాద్రెడ్డి, వై.శంకర్గౌడ్, గడ్డం లక్ష్మణ్గౌడ్, రంగంపల్లి రాజు, గడ్డం శ్రీధర్గౌడ్, దొమకొండ కిషోర్, అచిని మహేష్, పల్లి చంద్రశేఖర్, కుంకుమ శ్రీధర్ పాల్గొన్నారు.

## చదువుతో పాటు లలిత కళలకు ప్రాధాన్యత ఇవ్వాలి : డాక్టర్ శ్రీనివాస వరప్రసాద్ పాటి



మాదాపూర్ అన్నమయ్యపురంలో కూచిపూడి నాట్యగురువు డాక్టర్ శ్రీనివాస వరప్రసాద్ను ఘనంగా సత్కరించిన డాక్టర్ శోభరాజు దంపతులు

**మాదాపూర్ : జూలై 19, ప్రభాతవార్త**

చదువుతో పాటు లలిత కళలకు ప్రాధాన్యత ఇవ్వాలని కూచిపూడి నాట్య గురువు డాక్టర్ శ్రీనివాస వరప్రసాద్ పాటి తెలిపారు. శనివారం మాదాపూర్లోని అన్నమయ్య పురంలో అన్నమయ్యపద కోకిల, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ శోభరాజు దంపతులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శోభరాజు మాట్లాడుతూ దేశ విదేశాలలో ఉన్న వారికి ఆనెన్లైన్లో కూచిపూడి తరగతుల ద్వారా నేర్పించడం సంతోషమన్నారు. భావితరాలకు లలిత కళల గొప్పతనాన్ని తెలుపుతూ విద్యార్థులను ఆర్థికంగా, సామాజికంగా ఎదిగే విధంగా తీర్చి దిద్దాలని కోరారు. అనంతరం కూచిపూడి నాట్య గురువు డాక్టర్ శ్రీనివాస వరప్రసాద్ పాటి మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా కూచిపూడి నృత్యంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఇప్పటి వరకు 300 మందికి పైగా శిక్షణ ఇచ్చానన్నారు. అందులో దాదాపు 20 మందికిపైగా గురువులుగా మారి వారు కూడా శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. తన శిష్య బృందాలతో తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీశైలం, శ్రీకాళహస్తి తదితర ప్రముఖ దేవస్థానాలలో, యూనివర్సిటీలలో, ప్రముఖ ప్రాంతాలలో స్టేజి షోలను ఇచ్చినట్టు తెలిపారు. రవీంద్రభారతిలో చేసిన గోధాకళ్యాణం (కూచిపూడి యక్షగానం) నృత్యప్రదర్శన పలువురు ప్రముఖుల ప్రశంశలను పొందినట్టు పేర్కొన్నారు. చేసిన సేవలకు గాను నిసింబిత జ్ఞానపీఠ అవార్డు, ఉగాది పురస్కార అవార్డు, గురుసామ్రాట్, అదిత్య నాట్యనంది తదితర బిరుదులను అందుకున్నందుకు సంతోషాన్ని వ్యక్తపరిచారు. భరతవేద ఆర్ట్ అకాడమీ ద్వారా విద్యార్థులకు శిక్షణ తరగతులను అందిస్తు సామాజిక సేవా కార్యక్రమాలని మరిన్నీ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్యపురం సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ నందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి : ఆశన్న



సమావేశంలో మాట్లాడుతున్న ఆశన్న తదితరులు

**హైదరాబాద్,జూలై 19,ప్రభాతవార్త:**

విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే సుచి శుభ్రతతో గల నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలని బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు జి ఆశన్న అన్నారు. ఈమేరకు శనివారం నాంపల్లిలోని మైనార్టీ గురుకుల పాఠశాలలోని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి సూచనల మేరకు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ సంక్షేమ శాఖ వసతి గృహాల వంట మనుషులకు ఆహార పదార్థాల వండించే అంశం, శుభ్రత పై ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశన్న మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని అన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన ఆహార పదార్థాలు అందించే బాధ్యత ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులపై ఉందన్నారు. వంటలు చేసే సమయంలో వంట మనుషులు పలు జాగ్రత్తలు వహించాలని, వంటగదిని, వంట పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని తెలిపారు. త్రాగునీటి ట్యాంకులను తరచుగా శుభ్రం చేయాలని ముఖ్యంగా నీటితోనే అన్ని ఉత్పన్నమవుతుంటాయని సూచించారు. కాంట్రాక్టర్లు అందించి పరిశీలించాలని, కల్తీని, గడువు తేదీలను గుర్తించాలని సూచించారు. అలాగే వసతి గృహాల్లో సంబంధిత అధికారులు నిరంతరం విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై తనిఖీలు చేయాలన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలో వసతి గృహాలకు వచ్చే కూరగాయలు,పండ్లు, గుడ్లు ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ అధికారి ప్రవీణ్ రెడ్డి, మైనార్టీ సంక్షేమ అధికారి ఇలియాస్ అహ్మద్, టి విజయ్ కుమార్ రిటైర్డ్ డిప్యూటీ ఫుడ్ కంట్రోలర్, ఖలీల్, ధర్మేందర్ పాల ఫస్ట్ అండ్ ఫుడ్ కంట్రోలర్, వసతి సంక్షేమ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, వంట మనుషులు తదితరులు పాల్గొన్నారు.

## స్వర్ణలతకు మంత్రి పొన్నం ఆర్థిక సహాయం..



స్వర్ణలతకు మంత్రి పొన్నం అందించిన లక్షరూపాయల ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న మహంకాళీ ఆలయ ఈ ఓ మనోహర్రెడ్డి.

**బేగంపేట జూలై 19,ప్రభాతవార్త**

శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయంలో ఆషాడ బోనాల జాతర సందర్భంగా రంగం(భవిష్యవాణి) వినిపించే మాతంగి స్వర్ణలతకు మంత్రి పొన్నం ప్రభాకర్ లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు.మారేడుపల్లిలో నివసించే ఆమెకు గత కొద్ది రోజుల క్రితం మంత్రి డబుల్ బెడ్ రూం ఇంటిని కేటాయించి పట్టాను ఇప్పించారు.ఇటీవల బోనాల జాతర ఉత్సవాల సందర్భంగా మహాకాళీ ఆలయానికి వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ స్వర్ణలతను గృహ ప్రవేశం చేసావా అమ్మా అంటూ అడిగారు.పక్కనే ఉన్న ఈ ఓ మనోహర్ రెడ్డి ఆ ఇంటికి డోర్లు విరిగిపోయి ఉన్నాయి.లోపల ఇంకా కొన్ని పనులు చేయాల్సి ఉందని,ఆమె ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉందంటూ మంత్రికి వివరించారు.స్పందించిన మంత్రి లక్షరూపాయల ఆర్థిక సహాయం పంపించగా ఈ ఓ మనోహర్ రెడ్డి చేతుల మీదుగా స్వర్ణలతకు అందించారు.ఈ సందర్భంగా స్వర్ణలత మంత్రి పొన్నం ప్రభాకర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు.

## 1800 కులాలు రాజకీయ బానిసత్వంలో మగ్గిపోతున్నాయి : బిసి డిక్లరేషన్



బహుజన డిక్లరేషన్ ప్రకటిస్తున్న నేతలు

**సైఫాబాద్, జూలై 19 ప్రభాతవార్త:** దేశానికి స్వాతంత్ర్య వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచినప్పటికి దేశంలో ఉన్న 6 వేల కులాల్లో 1800 కులాలు రాజకీయ బానిసత్వం లోనే మగ్గుతున్నాయని నేషనల్ పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ ఆధ్వర్యంలో శనివారం బషీర్బాగ్ ప్రెస్క్లబ్లో జరిగిన బహుజన డిక్లరేషన్ ప్రకటించింది. ఓబిసిలు, ముస్లింలు, సిక్కులు తదితరులు రాజకీయ బానిసలుగానే కొనసాగుతున్నారని కొత్త రాజ్యాంగం ఏర్పడ్డాక కూడా ఈ రాజకీయ బానిసత్వం పెరిగిందే కాని తగ్గలేదని, బ్రిటిష్ కాలంలో ముస్లింలు, మహిళా సమాజానికి, ఎస్సీ, ఎస్టీ, ఓబిసిలు, సిక్కులు అందరికి రిజర్వేషన్లు ఇవ్వడం జరిగిందని కాని కొత్త రాజ్యాంగంలో కాంగ్రెస్ పార్టీ దుర్మార్గంగా బడుగు బలహీనవర్గాలకు ఇచ్చిన రిజర్వేషన్లను తీసివేసి కేవలం ఎస్సీ, ఎస్టీలకు కల్పించిందని ఫ్రంట్ ఆరోపించింది. దీంతో బిసిలకు చట్ట సభలలో రిజర్వేషన్లు లేకుండా పోయాయని, దీన్ని ప్రతిఘటించడానికి జనాభా ప్రాతిపదికన ఎమ్మెల్యే, ఎంపి సీట్ల కోసం ఒక ఉద్యమాన్ని ప్రారంభించడం జరిగిందని, ఇప్పటికే ఢిల్లీలో మొదటి సమావేశం జరిగిందని, నేడు హైదరాబాద్లో ఈ బహుజన డిక్లరేషన్ ఫర్ పొలిటికల్ జస్టిస్ అనే కాన్సెప్ట్ ఏర్పాటు చేయడం జరిగిందని ఫ్రంట్ పేర్కొంది. ఈ డిక్లరేషన్లో సోషలిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా, రాజ్యాధికార పార్టీ, ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ, బహున ద్రవిడియన్ పార్టీ, మన దేశం పార్టీల ముఖ్యులు విజిఆర్ నారగోని, జీవన్మల్ల, నూరల్ అమీన్, సుభద్రారెడ్డి, కె.బి.శ్రీధర్, పి.వి.కృష్ణయ్య, అన్వర్ఖాన్, జగదీశ్యాదవ్, కొల్లూరు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఛలో ఢిల్లీ జాతీయ సెమినార్లకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ



జాతీయ సెమినార్లకు సంబంధించిన పోస్టర్ను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్రెడ్డి

**హైదరాబాద్ జూలై 19 ప్రభాతవార్త:** జూలై 23,24 తేదీలలో ఆంధ్రప్రదేశ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బి.సి లకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలి డిమాండ్ చేస్తూ నిర్వహించతలపెట్టిన జాతీయ సెమినార్లకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం దుర్గా నరేష్, గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్రెడ్డి ఆవిష్కరించారు. ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, ఒరిస్సా రాష్ట్రాల నుండి పెద్ద యెత్తున ఛలో ఢిల్లీ సెమినార్ లో వివిధ పార్టీలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. 75 కోట్లకు పైగా ఉన్న బీసీ వర్గాల చిరకాల డిమాండ్లను కేంద్రం గౌరవించినట్లుగా ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలిపారు. 1931లో బ్రిటిష్ ప్రభుత్వం తీసిన లెక్కల తరువాత నరేంద్ర మోడి ప్రభుత్వం సాహసోపేతా నిర్ణయం తీసుకుందని ప్రశంసించారు. కుల గణన తర్వాత బీసీలకు చట్టసభలలో 50 రిజర్వేషన్లు, కేంద్రంలో ప్రత్యేక మంత్రి త్వ శాఖ, జనాభా ప్రకారం విద్య, ఉద్యోగ రిజర్వేషన్లు పెంపు వంటి నిర్ణయాలు కూడా తీసుకుంటారని కృష్ణ య్య ఆశాభావం వ్యక్తం చేశారు. బీసీల ఆశలకు ఆశ యాలకు అలాగే డిమాండ్లకు అనుగుణంగా ప్రధానమంత్రి నిర్ణయాలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## కోట విలక్షణ నటనకు కోట లాంటి వారు



**చిక్కడపల్లి, జూలై 19 ప్రభాతవార్త:** కోట విలక్షణ నటనకు పెట్టని కోట లాంటి వారు అని ప్రముఖులు నివాళులు అర్పించారు. శనివారం సాయంత్రం చిక్కడపల్లి త్యాగరాయ గానసభ లోని గుండవరపు హనుమంత రావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్. జనార్దన మూర్తి అధ్యక్షతన ఇటీవల మృతి చెందిన విఖ్యాత నటుడు కోట శ్రీనివాసరావు కు నివాళి సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు మాట్లాడుతూ కోట సినిమాలో సహజంగా ఆ పాత్ర స్వభావంలోకి ఇమిడి పోయే లక్షణం కల ప్రతిభాశాలి అన్నారు. ఆయన తోటి కళా కారుల పట్ల సహృదయత కల వారు అని వివరించారు. చిత్ర పరిశ్రమలో దర్శకుడు దాసరి నారాయణరావు గతం లో ఆయన ధైర్యం ఇచ్చేవారని, అలాగే కోట నటనకు దూరమైనా ఆయన ను చూసి నేర్చుకునే అవకాశం పోయిందని అవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ నటుడు సుబ్బరాయశర్మ మాట్లాడుతూ తాను ఎదిగి వచ్చిన నాటక రంగాన్ని విస్మరించనీ గొప్ప మనస్సు వున్న నటుడు కోట అన్నారు. ఆయనలో సృజనాత్మక నటన మహా నటులు అమితాబ్ బచ్చన్, రాజ కుమార్ వంటి వారి ప్రశంసలు పొందాడన్నారు. రంగస్థల సినీ ప్రముఖ నటుడు నిట్టల శ్రీరామ మూర్తి మాట్లాడుతూ సినీ నటుడు గా ఎదిగినా కోట కు రంగస్థలం అంటే ప్రాణం అని ఆయన నటులు పట్ల చూపే అభిమానం మరువలేనిదని చెప్పారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్థన మూర్తి మాట్లాడుతూ కోట పేరిట ప్రతి సంవత్సరం నాటక సంఘాల వారు వారం పాటు నాటక ప్రదర్శన చేస్తే గాన సభ లోని ఏదో ఆడిటోరియం ఉచితం గా ఇస్తామని ప్రకటించారు. రచయిత దర్శకుడు హనుమంత రావు, నటుడు మాణిక్ నిర్మాతలు రామ సత్యనారాయణ,వీర శంకర్, నాటక కళాకారులు రాధా కృష్ణ తదితరులు తమ నివాళులు అర్పించారు.

## ప్రజాప్రభుత్వం విద్య వైద్యరంగాలకు అధిక ప్రాధాన్యం : చిన్నారెడ్డి



వైద్యరత్న పురస్కారగ్రహీతలైన డాక్టర్లతో చిన్నారెడ్డి, దైవజ్ఞశర్మ, మల్లికార్జున్, రాఘవ, సతీష్కుమార్, ఈశ్వర్, రఘు తదితర అతిథులు

**రవీంద్రభారతి, జూలై 19 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రజాప్రభుత్వ విద్య వైద్యరంగాల్లో ఎన్నో గొప్పమార్పులు తీసుకొచ్చి అందరికీ అందుబాటులో ఉండే కార్యాచరణ చేపట్టిందని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి అన్నారు. మనకి ప్రాణంపోసేది దేవుడైతే దాన్ని కాపాడేవాడు వైద్యుడేనన్నారు. వైద్యుడి సేవలను ఎన్నటికీ మరచిపోలేమని చెప్పారు. ప్రభుత్వం వైద్యరంగానికి అధికప్రాధాన్యతతో ఎక్కువ మొత్తంలో ఖర్చుపెడుతున్నట్లు గుర్తుచేశారు. సమాజంలోని మంచిని, మంచివ్యక్తులను ప్రోత్సహించి ఉత్తేజపరుస్తున్న మథర్ ఫౌండేషన్... మల్లికార్జునరావు సేవలను ప్రశంసించారు. దైవజ్ఞశర్మ అధ్యక్షోపన్యాసంలో దానమిచ్చింది తనది దాచుకొన్నది పరులదని, మట్టిమీద మనంపడితే జననం, మట్టి మనమీదపడితే మరణమని, అందుకే విద్య, సంపద ఏదైనా మనకున్నదానిలో దానంచేస్తే కలకాలం నిలిచివుంటుందని, దాచుకొన్నది పరులపాలైపోతుందని, బతికున్నప్పుడే దానం, మంచిపనులు చేయాలని సూచించారు. మథర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో జాతీయ వైద్యుల దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి విశిష్ట అతిథులు మన్నె సతీష్కుమార్, సిహెచ్.రఘు రామారావు, కె.ఈశ్వర్చారి, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎ.మల్లికార్జునరావు, కార్యనిర్వహణ కార్యదర్శులు రాఘవ, సాయినాథ్, సాయికుమార్ తదితరులతో కలిసి జ్యోతిప్రకాసనంచేసి అనంతరం వైద్యవృత్తిలో ప్రజలకు విశేష సేవలందిస్తున్న పలువురు ప్రముఖ డాక్టర్లను ఘనంగా సత్కరించి వైద్యరత్న పురస్కారాలు అందజేసి శుభాభినందనలు తెలిపి వైద్యవృత్తిలో మరింత రాణించి విశేషసేవలందించాలని కోరారు. చివరిగా పురస్కార గ్రహీతలు తమ స్పందనను తెలిపారు.

## నేడే శ్రీకట్టమైసమ్మ మహాలక్ష్మి అమ్మవారి ఆషాడ బోనాల జాతర



శ్రీకట్టమైసమ్మ మహాలక్ష్మి అమ్మ వారి ఆలయం.

**బేగంపేట జూలై 19,ప్రభాతవార్త**

కట్టమైసమ్మ తల్లీ కాపాడమ్మా అంటూ భక్తులు కొలిచిందే తడువు వారిని కంటికి రెప్పలా కాపాడుతున్న కలువరేటి మైసమ్మ శ్రీకట్టమైసమ్మ మహాలక్ష్మి అమ్మ వారి ఆషాడ బోనాల జాతర ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేసారు.అమ్మ వారి ఆలయానికి ఆనుకుని ఉన్న నాలా ఉదృతంగా ఉప్పొంగి చుట్టు పక్కల ఉన్న బస్తీలను ముంచెత్తిన సమయంలో ప్రజలంతా పిల్లా పాపలతో బయటకు వచ్చి అమ్మ వారిని నాలా ఉదృతి తగ్గించి తమను కాపాడాలంటూ అమ్మ వారిని మొక్కుకున్నారు.అమ్మవారి మహిమ వల్ల కొద్ది వ్యవధిలోనే నీటి ఉదృతి తగ్గింది.ఆ రోజు నుంచి కలువరేటి మైసమ్మగా స్థానిక ప్రజలు కొల్చుకుంటున్నారు.కాల క్రమంలో కలువరేటి మైసమ్మ శ్రీకట్టమైసమ్మ మహాలక్ష్మిగా అవతరించారు.

### న్యాయవ్యవస్థపై ప్రతి ఒక్కరిలో అవగాహన కలిగి ఉండాలి

-బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ చైర్మన్ నర్సింహారెడ్డి



ప్రసంగిస్తున్న బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి

**చిక్కడపల్లి, జూలై 19 ప్రభాతవార్త:** న్యాయవ్యవస్థపై ప్రతి ఒక్కరిలో అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి అన్నారు. శనివారం బాగ్లింగంపల్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ లా కళాశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ న్యాయ దినోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు సదస్సు సందర్భంగా చర్చా కార్యక్రమం జరిగింది. 'న్యాయవ్యవస్థ సవాళ్లు' అన్న అంశంపై జరిగిన కార్యక్రమంలో ఏ నరసింహారెడ్డి మాట్లాడారు. ఇటువంటి ఆలోచనత్మక కార్యక్రమాలను అన్ని న్యాయవ్యవస్థల్లో జరపాలని అభిప్రాయపడ్డారు. ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు , డాక్టర్ ఎన్ రాంప్రసాద్ ,ప్రియా యాంగర్ ,ప్రముఖ న్యాయవాదులు కార్పొరేట్ ప్రముఖులు తదితరులు పాల్గొని తమ విలువైన అభిప్రాయాలను వెల్లడించారు. 'సాంకేతికరణ అంతర్జాతీయ న్యాయవ్యవస్థ సవాళ్లు-మహిళా రక్షణ చట్టపరమైన ఇబ్బందులు' తదితర అంశాల పై చర్చించారు. ఈ మూడు రోజుల విశ్లేషణాత్మక చర్చ కార్యక్రమంలో వక్తలు తమ విలువైన అభిప్రాయాలను వెల్లడించడంతో పాటు లోతైన విశ్లేషణ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల మేనేజ్మెంట్ సహకారంతో మరెన్నో కార్యక్రమాలు వివిధ అంశాలలో నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సృజన, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### నెట్వర్కింగ్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

**చిక్కడపల్లి, జూలై 19 ప్రభాతవార్త:** విలువైన జ్ఞానం, నెట్వర్కింగ్ అవకాశాలను అందిపుచ్చుకుంటే సాంకేతికపరంగా మరింత అభివృద్ధి చెల్లి అవకాశాలు ఉంటాయని వక్తలు పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఎక్స్ ఎక్స్పోజిషన్స్ లిమిటెడ్ ఆధ్వర్యంలో విలువైన జ్ఞానం నెట్వర్కింగ్ అవకాశాలు అంశాలపై సెమినార్ జరిగింది. ఈ సెమినార్ లో రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్స్ అధ్యక్షుడు ఆర్ఎస్వి బద్రీనాథ్, ఐ ఎ ఎల్ ఎ కార్యదర్శి బలరాజ్ కత్రి, అలీప్ కోశాధికారి, కార్యదర్శి కవిత రాజేష్, ఎఫ్ ఎస్ ఎం ఈ నుండి ఓ. లాస్య, ఎఫ్ ఎస్ ఎన్ ఎ నుండి వినయ్ కుమార్ రెడ్డి, ఎఫ్ ఈ టి ఎస్ ఐ ఏ అధ్యక్ష, కార్యదర్శులు రాజా మహేందర్ రెడ్డి, శంకర్, ఎం ఎస్ ఎం ఈ నుండి దశరథ్, జే ఐ ఏ అధ్యక్షుడు సాయి కిషోర్, జే ఐ ఏ, ఎం సి సభ్యుడు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రంగ రాజు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

### గాంధీనగర్ డివిజన్లో రోడ్ల అభివృద్ధికి కృషి



**చిక్కడపల్లి, జూలై 19 ప్రభాతవార్త:** గాంధీనగర్ డివిజన్లో రోడ్ల అభివృద్ధికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ అన్నారు. డివిజన్ పరిధిలో నేతాజీ నగర్ బస్తీలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న రోడ్డు సమస్యను పరిష్కరించి, నూతన సి సి రోడ్డు వేయించడంలో ప్రత్యేక చర్యలు చేపట్టినందుకు కార్పొరేటర్ను బస్తీ వాసులు సత్కరించి అభినందించే కార్యక్రమం జరిగింది. కార్పొరేటర్ పావనీ వినయకుమార్ మాట్లాడుతూ డివిజన్ లోని అన్ని బస్తీలను అభివృద్ధి పరిచి సమస్యరహిత డివిజన్ ను రూపొందించడానికి అనునిత్యం కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు వి.నవీన్ కుమార్, సీనియర్ నాయకులు శ్రీకాంత్,ఆనంద్ రావు, హనుమంతు, ప్రశాంత్ మరియు బస్తి వాసులు ఆనంద్ యాదవ్ యాదగిరి,కుమార్, నాగరాజు, రాజ్ కుమార్, శ్రీకాంత్ మంగమ్మ, సువర్ణ, రత్న,స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై వెలిసిన అక్రమ నిర్మాణాలు నేలమట్టం

- ప్రజలందరూ నిబంధనలు పాటించాలి : టిపిఓ



కోకాపేట్లో రోడ్డుపై వెలిసిన అక్రమ నిర్మాణాలు పోలీసు బందోబస్తు మధ్య జేసీబీతో తొలగించిన నార్సింగి మున్సిపల్ అధికారులు

**నార్సింగి, జూలై 19 ప్రభాతవార్త :** నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట్లో రోడ్డును ఆక్రమించుకొని వెలిసిన అక్రమ నిర్మాణాలను శనివారం టౌన్ప్లానింగ్ అధికారులు నేల మట్టం చేవారు. నార్సింగి పోలీసుల బందోబస్తు మధ్య జేసీబీ తో మూడు అక్రమ నిర్మాణాలు కూల్చి వేశారు. తమ షెడ్లు తొలగించవద్దని స్థానికులు పోలీసులతో వాగ్వాదం చేశారు. పోలీసులను ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని తోసేశారు. కొంత సమయం పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ సందర్భంగా టిపిఓ మణిహారిక మాట్లాడుతూ ప్రజలందరూ టౌన్ప్లానింగ్ నిబంధనలు పాటించాలని సూచించారు. కోకాపేట్లోని నార్త్ స్టార్ విల్లాస్కు సమీపంలో ఉన్న రోడ్డును కొంత మంది స్థానికులు ఆక్రమించి తాత్కాలిక నిర్మాణాలు చేపట్టారని, ఈ విషయంను స్థానికులు మా దృష్టికి తీసుకు వచ్చారని, వెంటనే వాటిని కూల్చి వేశామన్నారు. రోడ్లు ప్రజలందరూ ఉపయోగించుకేవని, అలాంటి రోడ్లకు సంబంధించిన స్థలాన్ని కబ్జా చేయడం చట్ట రిత్యా నేరమని తెలిపారు. టౌన్ప్లానింగ్ నిబంధనలు ఎవరు ఉల్లంఘించినా కఠినంగా వ్యవహరిస్తామని నార్సింగి మున్సిపల్ టిపిఓ మణిహారిక హెచ్చరించారు.

### సాంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టేలా బోనాలు జరుపుకోవాలి



గాయిత్రినగర్లో విజ్ఞాన జ్యోతి పాఠశాలలో బోనాల ఉత్సవాలను జరుపుకుంటున్న చిన్నారులు.

**యూసుఫ్గూడ, జూలై 19, ప్రభాతవార్త :**

తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టే విధంగా ఆశాడ బోనాల ఉత్సవాలను ప్రజలంతా అంగరంగా వైభవంగా జరుపుకుంటారని విజ్ఞాన జ్యోతి హైస్కూల్ కరస్పాండెంట్ ఎస్ చలపతిరావు అన్నారు. శనివారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయిత్రినగర్ విజ్ఞాన జ్యోతి హైస్కూల్లో సంప్రదాయ బద్ధంగా చిన్నారులు బోనాల ఉత్సవాలను నిర్వహించుకున్నారు. పోతురాజు విన్యాసాలతో డప్పు మోతలతో స్కూల్ ఆవరణ అంతా పండుగా వాతావరణం నెలకొన్నది కార్యక్రమంలో ఉపధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు పండుగ పర్వదినాల ప్రత్యేకతలను బోధించాలి

**యూసుఫ్గూడ, జూలై 19, ప్రభాతవార్త :**

చదువుతో పాటు పాఠశాలలో పండుగ పర్వదినాల ప్రత్యేకతలను కూడా విద్యార్థులకు బోధించటం జరుగుతుందని శ్రీనిధి అక్షరదామం డైరెక్టర్ కొల్లి లక్ష్మణ్ అన్నారు. శనివారం కళ్యాణ్ నగర్లోని శ్రీనిధి అక్షరదామం పాఠశాలలో ఆశాడ మాసం బోనాల పండుగను అంగరంగా వైభవంగా నిర్వహించారు. చిన్నారులు బాల బాలికలు వివిధ వేశధారణలతో అలరించారు. ముఖ్యంగా పోతురాజు విన్యాసం చిన్నారులు అమ్మవార్లకు బోనాలు సమర్పించటం రకరకాల నైవేద్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ గీత, వైస్ ప్రిన్సిపల్ విమల, రాజేశ్వరి, విజయలక్ష్మి, సంధ్యారాణి, కవిత, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

### ఆగస్టు 7న గోవాలో ఒబిసి జాతీయ మహాసభ..

బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

**హైదరాబాద్,జూలై 19,ప్రభాతవార్త:**

వచ్చేనెల ఆగస్టు 7న గోవా రాష్ట్రంలోని శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో జాతీయ ఓబీసీ మహాసభను పెద్ద ఏత్తున నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. దేశంలో మొదటిసారి మండల కమిషన్ సిఫార్సులైనా ఓబీసీలకు ఉద్యోగ రంగంలో 27 రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్టు స్వర్గీయ మాజీ ప్రధాని వీపీ సింగ్ ప్రకటించిన ఆగస్టు7 రోజున ప్రతి సంవత్సరం దేశంలోని అన్ని బిసి ఉద్యమ శక్తులను వ్యక్తులను కలుపుకొని జాతీయ ఓబీసీ మహాసభను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పదవ సారి జరిగే ఈజాతీయ ఓబీసీ మహాసభకు దేశంలోని 29 రాష్ట్రాల నుండి పదివేల మంది ఓబీసీ ప్రతినిధులు హాజరవుతున్నారని, ఈఈ మహాసభకు దేశంలోని అఖిలపక్ష రాజకీయ పార్టీల నేతలను, ఓబిసి జాతీయ నాయకులను ఆహ్వానించినట్లు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఉదయం 10 గంటలకు గోవా రాష్ట్రంలోని శ్యాం ప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో ప్రారంభమయ్యే ఈ మహాసభకు తెలుగు రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున కదిరి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహాసభలో జాతీయస్థాయిలో ఓబీసీలు ఎదుర్కొంటున్న డిమాండ్లపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్లు జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

## డివైడర్ను ఢీకొట్టి లారీ బోల్తా

**హైదరాబాద్, జూలై19, ప్రభాతవార్త:** నిద్రమత్తులో లారీ డ్రైవర్ అతివేగంగా నడుపుతూ డివైడర్కు ఢీకొట్టి బోల్తాపడింది. డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. శనివారం తెల్లవారుజామున పంజాగుట్ట పోలీస్స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అమీర్పేట నుంచి ఖైరతాబాద్ ప్రధానమార్గంలో పురుగులమందు లోడుతో వేగంగా వెళ్తున్న లారీ మెట్రో స్టేషన్ వద్ద డివైడర్కు ఢీకొట్టి అదుపుతప్పింది. లారీ అడ్డుతో ఉదయం వేళల్లో విధులకు వెళ్తున్న వాహనాలతో భారీగా ట్రాఫిక్జాం ఏర్పడింది.

## ముఖ్యమైన పండుగలలో ఒకటైన బోనాల పండుగ


సంప్రదాయ బట్టలు ధరించి బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు

**పేట్ బషీరాబాద్, జూలై 19, ప్రభాతవార్త**
సుచిత్రా సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ శనివారం ముఖ్యమైన పండుగలలో ఒకటైన బోనాలను అత్యంత ఉత్సాహంతో, సంప్రదాయ భావనతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు రాష్ట్ర సాంస్కృతిక వారసత్వం గురించి, పురాతన ఆచారాలను గౌరవించడం గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక తరగతి విద్యార్థులు సంప్రదాయ బట్టలు ధరించి బోనాలు నృత్యం చేస్తూ, దేవి మహాకాళికి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఎన్.పి. సుందర రాజు మాట్లాడుతూ బోనాలు కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, తెలంగాణ సంప్రదాయాల ప్రతిబింబం అని అన్నారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా యువతలో మన సాంస్కృతిక గుర్తింపును పెంపొందించడమే కాకుండా మన వారసత్వాన్ని సజీవంగా ఉంచాలనేది మా లక్ష్యమని అన్నారు. స్కూల్ మేనేజ్మెంట్ ల్, ఎడ్యుకేషనల్ డైరెక్టర్ ఎన్.ఆర్. సరిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ఈ కార్యక్రమాన్ని గొప్ప విజయంగా నిర్వహించారన్నారు.

### బోనాల ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఎమ్మెల్సీ శంభిపూర్ రాజును ఆహ్వానిస్తున్న ధనరాజ్ యాదవ్

**నిజాంపేట్, జూలై 19, ప్రభాతవార్త**
నిజాంపేట్‌లో ఆదివారం రోజు జరిగే బోనాల ఉత్సవాలకు అలాగే సోమవారం రోజు జరిగే రాజీవ్ గృహకల్పలో తొట్టెలు వేడుకకు నిజాంపేట్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, సాంబశివారెడ్డి మిత్ర బృందం, జెఎస్ఆర్ యూత్ సభ్యులతో శనివారం ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్సీ శంభిపూర్ రాజు, ఎమ్మెల్యే కేపీ వివేకానందలను కలిసి ఆహ్వాన పత్రికలను అందజేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాంబ శివ రెడ్డి, నీరుడు యాదగిరి, బిక్షపతి, జలగం చంద్రయ్య, నర్సింగ్, శ్రీను, కురుమూర్తి జెఎస్ఆర్ యూత్ సభ్యులు ప్రవీణ్, చరణ్, ఉమా శంకర్, సందీప్, ఆవుల రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర కీలకం : ఎమ్మెల్యే కెపి.వివేకానంద్


ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌ను శాలువాతో సత్కరిస్తున్న కార్యవర్గ సభ్యులు

**పేట్ బషీరాబాద్, జూలై 19, ప్రభాతవార్త**
132 జీడిమెట్ల డివిజన్ శ్రీకృష్ణానగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ కాలనీ అభివృద్ధిలో సంక్షేమ సంఘాల పాత్ర ఎంతో కీలకమని, శ్రీ కృష్ణా నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గానికి నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో నూతన అధ్యక్షులు హరిప్రసాద్, ప్రధాన కార్యదర్శి రవీందర్, ఉపాధ్యక్షులు నర్సింహులు, కోశాధికారి చంద్ర శేఖర్, సంయుక్త కార్యదర్శి చిరంజీవి, బి.కురుమూర్తి, ఎన్.నరేందర్ నాయుడు, పి.నందు, బి.చంద్రశేఖర్, కార్యనిర్వాహక కార్యదర్శి వెంకటేశం, శేఖర్, శ్రీహరి గౌడ్, ప్రభాకర్, సుబ్రమణ్యం, ఆంజనేయులు, రాజు రెడ్డి, రాధాకృష్ణ, ప్రభాకర్ రెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌ని కలిసిన ఎర్రోళ్ల లక్ష్మణ్

పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్‌ని శనివారం అంబేద్కర్ యువజన సంఘం వెల్ఫేర్ అసోసియేషన్ కొంపల్లి మున్సిపల్ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన ఎర్రోళ్ల లక్ష్మణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సంఘం కొంపల్లి మున్సిపల్ అధ్యక్షులుగా ఎన్నికైన ఎర్రోళ్ల లక్ష్మణ్‌కు అభినందనలు తెలిపారు. బడుగు, బలహీన, అణగారిన వర్గాల అభ్యున్నతికై డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు.

## స్కూల్స్‌లో వైభవంగా బోనాల సంబరాలు


బోనం ఎత్తిన విద్యార్థులు

**జీడిమెట్ల, జూలై 19, ప్రభాతవార్త**
బోనాల పండుగ సంబరాలు శనివారం టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో అంగరంగ వైభవంగా జరిగాయి. సత్యవాణి విద్యా నికేతన్, ఎస్ఆర్ నాయక్ నగర్, టివిఆర్ మోడల్ హై స్కూల్ అపురూప కాలనీ నందు టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ ( కరెస్పాండెంట్) టీ.అరుణ కుమారి ఆధ్వర్యంలో బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్ డైరెక్టర్ టీ.అరుణకుమారి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆషాడమాసంలో వచ్చే బోనాల జాతరకు ఒక ప్రత్యేకత ఉందన్నారు. వేసవి తర్వాత వచ్చే వర్షాకాల వాతావరణంలో పచ్చని చెట్లు చిగురించి వాతావరణంలో కలిగే మార్పులు వర్షపు నీటితో వచ్చే మార్పులు చిన్నారులకు పెద్దలకు ఎటువంటి అంటూ వ్యాధులు ప్రబలకుండా అమ్మవార్లను వేడుకొని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక భోజనం వండి, మట్టి కుండలో నైవేద్యం పెట్టి అమ్మవార్లను పూజిస్తారని తెలిపారు. బోనం యొక్క గొప్పతనం ప్రత్యేకతలను విద్యార్థిని విద్యార్థులకు తెలిపే విధంగా పండగను జరిపి, వివరించామన్నారు. ప్రస్తుతం ఈ పండగలకు వేపాకు ప్రత్యేకత చాలా గొప్పదని, చలువ నిచ్చే చక్కని గాలి ఆకులోని చేదు గుణం రోగనిరోధక శక్తిని ఇచ్చి ఆరోగ్యాన్ని కాపాడే గొప్ప ఔషధ గుణాలు ఉన్న వేప అని, అందుకే వేపాకును అంతగా ఆరాధిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మన్ టీ కోటిరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ టీ వంశీకృష్ణ రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ దీప్తి రెడ్డి, ఎల్కేజీ, యూకేజీ చిన్నారులు ప్రిన్సిపల్ జయరాజ్ అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## యాదవులకు మైనంపల్లి హనుమంతరావు భేషరతుగా క్షమాపణలు చెప్పాలి

### రాధాకృష్ణయాదవ్‌కు మద్దతు తెలిపిన అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు రవీందర్ యాదవ్


రాధాకృష్ణ యాదవ్‌కు మద్దతు తెలుపుతున్న అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర నాయకులు

**ముషీరాబాద్, జూలై 19, ప్రభాతవార్త:** యాదవులపై దూషణలు చేసిన మైనంపల్లి హనుమంతరావు భేషరతుగా క్షమాపణలు చెప్పాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. శనివారం అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు చింతల రవీంద్రనాథ్ యాదవ్ నేతృత్వంలో ప్రతినిధులు రాధాకృష్ణ యాదవ్‌ను కలిసి, మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గంలో బోనాల చెక్కుల పంపిణీ సందర్భంగా జరిగిన రాజకీయ ఘర్షణలో సమోధ్యకు మధ్యవర్తిగా వ్యవహరించిన రాధాకృష్ణ యాదవ్‌పై మైనంపల్లి ఇష్టం వచ్చినట్లు దూషణ చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాధాకృష్ణ యాదవ్‌పై జరిగింది కేవలం వ్యక్తిగత విమర్శ కాదని, ఇది సంఘ బలాన్ని పరీక్షించే ఒక ప్రయోగమని అన్నారు. తక్షణమే మైనంపల్లి యాదవులకు క్షమాపణలు చెప్పాలని, లేనిపక్షం భవిష్యత్తులో దీని పరిణామం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్, నాయకులు దారబోయిన శ్రీనివాస్ యాదవ్, గండి జగన్‌యాదవ్, జగదీష్‌యాదవ్, వేణు గోపాల్‌యాదవ్, రాష్ట్ర యువజన అధ్యక్షులు గొర్ల యశ్వంత్‌రాజ్ యాదవ్, మణియాదవ్, ఎన్.శివయాదవ్, న్యాయవిభాగం గ్రేటర్ ప్రధాన కార్యదర్శి బావని మురళీధర్‌యాదవ్, మేడ్చల్ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి సర్వేశ్‌యాదవ్, మల్కాజిగిరి యువజన అధ్యక్షులు సతీష్ యాదవ్, నాయకులు రాజుయాదవ్, సాయి యాదవ్, శశియాదవ్, రాము యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### నూతన సిఐ సతీష్ కుమార్‌ని కలిసిన రాజు ముదిరాజు


సీఐ సతీష్ కుమార్‌ని సత్కరిస్తున్న ఆగం రాజు ముదిరాజు

**నిజాంపేట్, జూలై 19, ప్రభాతవార్త**
17వ డివిజన్ మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజు బాచుపల్లి పోలీస్ స్టేషన్‌కి నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన సతీష్ కుమార్‌ని మర్యాదపూర్వ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ యూత్ అధ్యక్షులు బద్రి, జల్లూరి రమణ, అన్వేష్, సాయిల్ పాల్గొన్నారు.

### బోనాల జాతరకు కొలన్ శ్రీనివాస్‌రెడ్డికి ఆహ్వానం..


కొలన్ శ్రీనివాస్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న యువకులు

**నిజాంపేట్, జూలై 19, ప్రభాతవార్త**
నిజాంపేట్ ఫేస్ 1, ఫేస్ 2 యువకులు రానున్న బోనాలు పండుగ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి బోనాల పండుగకు ముఖ్యఅతిథిగా విచ్చేయాలని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రుత్విక్ మాగంటి, మహేష్, ప్రబోధ్, అరవింద్, నరేష్, సాయి, గంగాధర్, రాహుల్, చరణ్, అరవింద్,రమేష్, సాకేత్, బి కార్తీక్, శ్రీకాంత్, మనోహర్, చేతన్, మనీ, అరుణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### పలు ఆహ్వానాలు, వినతిపత్రాలు స్వీకరించిన కూన శ్రీశైలం గౌడ్


ఆహ్వానాలు, వినతులు స్వీకరిస్తున్న శ్రీశైలంగౌడ్

**పేట్ బషీరాబాద్, జూలై 19, ప్రభాతవార్త**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని షాపూర్ నగర్‌లో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ తన నివాసం వద్ద నియోజకవర్గం ప్రజలు, నాయకుల నుండి వచ్చిన పలు ఆహ్వానాలు, వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం ఈనెల 26వ రోజున కొంపల్లి పట్టణంలో జడే స్పెషలిటి హాస్పిటల్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. 131 కుత్బుల్లాపూర్ డివిజన్, గణేష్ నగర్ టెంపుల్ నూతన కార్యవర్గాన్ని శాలువాతో సత్కారించి అభినందించారు. నియోజకవర్గంలో నేడు నిర్వహించబోయే బోనాల పండుగకు ముఖ్యతిధిగా హాజరువ్వాలని పలు ఆహ్వానాలు అందజేశారు. బతుకమ్మ బండ అభివృద్ధికి మరింత సహకరించాలని ఆయ బస్తివాసులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ ఆహ్వానాలు, వినతిపత్రాలు స్వీకరించి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళపై యువకుడి దాడి

### అడ్డుకున్న వారిపై బూతుపురాణం

**దుండిగల్, జూలై 19 ప్రభాతవార్త:** బతుకుదెరువు కోసం వచ్చిన ఓ మహిళపై స్థానికంగా ఉన్న ఓ యువకుడు జుట్టు పట్టుకొని ఈడ్చుకెళ్తూ అందరూ చూస్తూండగానే దాడికి పాల్పడిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గురువారం రాత్రి జరిగిన ఈసంఘటనకు సంబందించిన వీడియో శనివారం సోషల్ మీడియాలో వైరల్ అయింది. మహిళల రక్షణకు అనేక చట్టాలు తీసుకువస్తున్నా అధికారులు ఉదాసీనత వైఖరితో ఇటువంటి అమానవీయ ఘటనలు అక్కడక్కడా చోటు చేసుకుంటూనే ఉన్నాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం...గాగిల్లాపూర్‌కు చెందిన కోఠి కుమారుడు చైతన్య(25) గురువారం రాత్రి మద్యం సేవించి స్వప్న వైన్స్ సమీపంలో నివాసం ఉంటున్న ఓ మహిళ ఇంటి ముందు గొడవకు దిగాడు. సదరు మహిళ 100డయల్ చేసి సమాచారం అందించింది. అయినప్పటి అతను పోలీస్. పోలీస్.. పోలీస్..ఐవాంట్ దట్ అంటూ గట్టిగా అరుస్తూ మహిళ జుట్టు పట్టుకొని ఈడ్చుకెళ్తూ బూతుపురాణం మొదలుపెట్టాడు. నాకు మీరు ఎవరో తెలియదు వదిలేయండి బతిమిలాడిన వినకుండా విచక్షణ కోల్పోయి ప్రవర్తించాడు. బతుకు దెరువు కోసం వేరే ప్రాంతానికి వచ్చిన మహిళ కావడంతో స్థానికుడైన చైతన్య అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తెలుస్తుంది. అందరూ చూస్తూండగా జుట్టు పట్టుకొని అటుఇటూ తిప్పుతూ అడ్డుకునేందుకు యత్నించిన వారిపై దుర్భషలాడదంతో దేహశుద్ది చేసి పోలీసులకు అప్పగించారు. మహిళ భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ జరుపుతున్నట్లు పోలీసులు పేర్కొంటున్నారు. నిందితుడిపై పోలీసులు ఫిర్యాదు చేసినట్లు తెలుసుకున్న అతని తండ్రి, బంధువులు సదరు మహిళ ఉంటున్న ఇళ్ళను బలవంతంగా ఖాళీ చేయించినట్లు స్థానికులు తెలుపుతున్నారు. కాగా నిందితుడు గతంలో మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మహిళను వేధించిన కేసులో ఆరు నెలల జైలుశిక్షను అనుభవించడంతో పాటు జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లోనూ ఓ కేసులో నిందితుడుగా ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

## బిసి రిజర్వేషన్ అంశాన్ని రాజ్యాంగ 9వ షెడ్యూల్‌లో చేర్చాలి

### ధర్మసమాజ్ పార్టీ ముషీరాబాద్ ఇన్‌చార్జి గుడపర్తి సంతోష్

**ముషీరాబాద్, జూలై 19, ప్రభాతవార్త:** బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అంశాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి, కాంగ్రెస్‌కు బీసీలపై ఉన్న చిత్తశుద్ధిని బుజువు చేసుకోవాలని ధర్మసమాజ్‌పార్టీ ముషీరాబాద్ ఇన్‌చార్జి గుడపర్తి సంతోష్ డిమాండ్ చేశారు. శనివారం ధర్మసమాజ్‌పార్టీ, ముషీరాబాద్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలనే అంశంపై విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ 33శాతం అమలవుతున్న రిజర్వేషన్లను 18శాతానికి తగ్గించి, బీసీలకు అన్యాయం చేసిన బీఆర్ఎస్ పార్టీ అధికారం కోల్పోయాక, బీసీల కోసం ధర్నాలు చేయటం సిగ్గుచేటని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్ లో బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్లు అమలుకై కేంద్రంపై వత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ధర్మసమాజ్ పార్టీ నాయకులు నర్సింగ్, కిరణ్, జి.రాజు పాల్గొన్నారు.

### బోయిన్‌పల్లి ముంపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే శ్రీగణేష్ పర్యటన


బారీ వర్షానికి బోయిన్‌పల్లిలో ముంపునకు గురైన ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్,జంపన,ముప్పిడి మధుకర్ తదితరులు

**కంటోన్మెంట్,జూలై 20 ప్రభాతవార్త:** రెండు రోజుల నుంచి కురుస్తున్న బారీ వర్షానికి 6వ వార్డు బోయిన్‌పల్లిలోని మర్రిరామ్‌రెడ్డి కాలనీ, సీతారామ్‌పూర్ కాలనీ, భారతీ ఎన్‌క్లేవ్, రామన్నకుంట చెరువు లోతట్టు ప్రాంతాలన్నీ ముంపునకు గురైయ్యాయి. విషయం తెలుసుకున్న కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ పర్యా టించి పరిస్థితులను పర్యవేక్షించారు. ముంపునకు గురైన ప్రాంతాలపై సహాయక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెం ట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, కాంగ్రెస్ నాయకులు ముప్పిడి మధుకర్,శరత్, లికేశ్,భాగ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడే మారేడ్‌పల్లి బోనాలు

### ఏర్పాట్లను పర్యవేక్షించిన మైనంపల్లి,గొల్లకిట్టు


మారేడ్‌పల్లి బోనాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావ్

**అడ్డగుట్ట,జూలై 20 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ కంటోన్మెంట్ మారేడ్‌పల్లిలోని శ్రీ మైసమ్మ బోనాల ఉత్సవాలు బారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు ఎసిద్దం చేశారు. ఆలయ నిర్వాహకులు, సీనియర్ కాంగ్రెస్ నేత క్రిష్ణ యాదవ్ (గొల్లకిట్టు),తిరుమల్ వంశీల ఆధ్వర్యంలో ఆదివారం, సోమవారం రెండు రోజుల్లో జరిగే బోనాలు, పలహార బండ్ల ఊరేగింపు బారీ ఎత్తున నిర్వహించేందుకు మారేడ్‌పల్లి ప్రధాన రోడ్డు మార్గాల్లో రంగు రంగుల విద్యుత్ దీపాలు, స్వాగత వేదికలు, బారీ కటౌట్లు, దేవతా మూర్తులను ఏర్పాటు చేయడంతో పరిసర ప్రాంతాలు శోభాయమయంగా మారాయి. ఈ ఏర్పాట్లను శనివారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావ్ పర్యవేక్షించారు. ఈ ఉత్సవాలకు ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ళశ్రీధర్ బాబు, ఎంపీలు ఈటెల రాజేందర్, అనీల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, మ ర్రి రాజశేఖర్‌రెడ్డి, మల్లారెడ్డి, పద్మారావు గౌడ్‌లు విచ్చేయనున్నట్లు అలయ నిర్వాహకులు గొల్లకిట్టు తెలిపారు.

### ఎన్టీఆర్‌నగర్‌లో రేణుక ఎల్లమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపన


అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

**కెపిహెచ్బి కాలనీ, జూలై 19, ప్రభాతవార్త**
ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయం విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై అమ్మవారి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో యువనేత దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, సంతోష్ బిరాదర్, రాజ్యలక్ష్మి, సౌందర్య, కృష్ణవేణి, లావణ్య, సరిత, సురేష్, పద్మ, లత, శ్రావణి, సాయి, జ్యోతి, సత్య, అమర్ తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లి జెఎన్టియుసిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


అధ్యాపకులతో 2000 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

**కెపిహెచ్బి కాలనీ, జూలై 19, ప్రభాతవార్త**
కూకట్పల్లిలోని జవహర్లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించిన ఈఈఈ, ఈసీఈ విభాగాల 2000 సంవత్సరం బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం పునర్మిళన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యనందించిన విభాగాల్లోని ప్రయోగశాలలను సందర్శించి, విద్యార్థిగా గడిపిన రోజుల జ్ఞాపకాలను పునఃస్మరించుకున్నారు. అనంతరం, తమకు బోధన అందించిన అధ్యాపకులు, పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులను హృదయపూర్వకంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని జేఎన్టీయూహెచ్ డైరెక్టర్ - అల్యూమ్నీ వ్యవహారాలు ప్రొఫెసర్ పి. భ్రమర సమన్వయంతో నిర్వహించారు. ఆమె మార్గదర్శనంలో ఈ పునర్మిళన సభ విజయవంతంగా కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఈసీఈ విభాగాధిపతి ప్రొఫెసర్ టి. మాధవి కుమారి, ఈఈఈ విభాగాధిపతి ప్రొఫెసర్ కె. ఫణిశ్రీలు సమన్వయం వహించారు. రెండు విభాగాలకు చెందిన అన్ని అధ్యాపకులూ, ఇతర సిబ్బంది కార్యక్రమ విజయవంతానికి అవసరమైన సహకారం అందించారు. పూర్వ విద్యార్థులు విశ్వవిద్యాలయ లక్ష్యాల పట్ల తమ అనుబంధాన్ని పునరుద్ఘాటిస్తూ, భవిష్యత్తులో విశ్వవిద్యాలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ పునర్మిళన సభ, పూర్వ విద్యార్థులకు మధుర జ్ఞాపకాలను పునఃస్మరించేందుకు, అధ్యాపకుల పట్ల కృతజ్ఞతలు తెలియజేయడానికి, పరస్పర సంబంధాలను మరింత బలపరిచేందుకు ఒక అద్భుతమైన వేదికగా నిలిచిందని విద్యార్థులు పేర్కొన్నారు.

## బిసిలకు అన్ని రంగాలలో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి


బీసీ కమీషన్ ఛైర్మన్‌కు, సభ్యులకు వినతి పత్రం అందచేస్తున్న బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ కమిటీ నేతలు

**ముషీరాబాద్, జూలై 19, ప్రభాతవార్త:** బీసీలకు విద్య, రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు శనివారం రాష్ట్ర బీసీ కమీషన్ ఛైర్మన్ నిరంజన్, సభ్యులు సురేందర్, జైప్రకాష్ తదితర సభ్యులను బీసీ ఏ కులాల హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని అమలుచేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటామని ప్రకటించటం అభినందనీయమన్నారు. బీసీలు అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారని, అన్ని రంగాలలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కమీషన్ ఛైర్మన్ తప్పకుండా మీరు చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ ఏ.భాగయ్య, అధ్యక్షులు ఎం.ఎస్.నరహరి, తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షులు గడప శ్రీహరి, బీసీ ఏ కులాల అధికార ప్రతినిధి కంటే రాంచందర్, అంబటి సుధాకర్ గంగపుత్ర, వాణి, తెలంగాణ ప్రాంతీయ ఉద్యమ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు గుండా యాదగిరి, పాండుగౌడ్, ప్రధాన కార్యదర్శి బత్తుల సాయిబాబా, గణేష్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

### సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా పేదలకు చేయూత


లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న బండి రమేష్

**కెపిహెచ్బి కాలనీ, జూలై 19, ప్రభాతవార్త**
ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా నిరుపేదలకు చేయూత లభిస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ పేర్కొన్నారు. కూకట్పల్లి నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలలో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు మంజూరైన 1 లక్ష 9 వేల రూపాయలకు సంబంధించిన చెక్కులను పార్టీ కార్యాలయంలో శనివారం అందజేశారు. కూకట్పల్లి నియోజకవర్గంలోని రాచూరి సంధ్యారాణి, చంద్రమౌళిలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు మంజూరయ్యాయి. చెక్కులను శనివారం బండి రమేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు లక్ష్మయ్య, తూము వేణు, మస్తాన్ రెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు రాష్ట్ర ముఖ్యమంత్రి వరరేవంత్ రెడ్డికి, బండి రమేష్‌కి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

### ప్రశ్నిస్తే కేసులు పెట్టడం సరైంది కాదు : మన్నెక్రిషాంక్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మన్నెక్రిషాంక్ తదితరులు

**అడ్డగుట్ట,జూలై 19 ప్రభాతవార్త:** ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి బంధువులు చేస్తున్న కుంభకోణాలపై ప్రశ్నిస్తూ జెబిఎస్ వద్ద ఏటూజెడ్ స్కామ్‌ల పేరుతో ప్రశ్నిస్తూ హోర్డింగ్ ఏర్పాటు చేసిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేయడం సరైంది కాదని బిఆర్ఎస్ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ మన్నె క్రిషాంక్ తెలిపారు. శనివారం సాయంత్రం మారేడ్‌పల్లి పోలీస్‌స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన విలేకర్ల స మావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్ర భుత్వం చేసు_న్న తప్పి దాలను ప్రశ్నిస్తే తమై అక్రమ కేసులు బణాయిస్తున్నాం ^ని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సిఎం రేవంత్‌రెడ్డి పాలనలో జరుగుతున్న అవినీతి కుంభకోణాలను ఎండగట్టినందుకు తమపై కేసులు పెట్టడం ఎంత వరకు సమంజ సమని ప్రశ్నించారు.

### పారిశుధ్య కార్మికులను గౌరవిద్దాం : ఎమ్మెల్యే కృష్ణారావు


కార్మికులకు కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కెపిహెచ్బి కాలనీ, జూలై 19, ప్రభాతవార్త**
కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంపు కార్యాలయంలో శనివారం జిహెచ్ఎంసి కార్మికులకు వ్యక్తిగత పరిశుభ్రత పరిరక్షణ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి రక్షణ కవచంలా పారిశుధ్య కార్మికులు ఉంటారనీ అనడంలో అతిశయోక్తి లేదని అన్నారు. పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రత్యేక చొరవ తీసుకొని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిరంతరం పనిచేస్తున్న పరిశుద్ధ కార్మికులను ప్రతి ఒక్కరు గుర్తించి గౌరవించాలని చెప్పారు. కార్మికులు కూడా ఆయురారోగ్యాలతో ఉంటేనే మనం బాగుంటామని వారి వ్యక్తిగత పరిశుభ్రత కోసం ఈ కిట్లను అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్, ఎస్ఎస్ మానో రెడ్డి, ఎస్ఆర్‌పి వినయకాంత్, ఎస్ఎఫ్ వికుమార్ పాల్గొన్నారు.

### కుత్బుల్లాపూర్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

**జగద్గిరిగుట్ట, జూలై 19, ప్రభాతవార్త**
126 జగద్గిరిగుట్ట డివిజన్ బీహార్ గల్లీ సీసల బస్తి ప్రధాన రహదారి, సోమయ్య నగర్ బస్తీలలో 30 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డును బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కాలనీలలో మౌలిక వసతులను కల్పించడం ప్రజా ప్రతినిధులుగా మా బాధ్యత అని తెలిపారు. గత 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచామన్నారు. రానున్న రోజుల్లో మౌలిక వసతుల కల్పనలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC
ప్రతిపాదన కొరకు అభ్యర్థన యొక్క ప్రకటన (REP)
REP No. 01/EE/PDCZ/GHMC/2025-26/2వ పిలుపు తేది: 19.07.2025.
ఐటమ్ నం.1, పని పేరు: ఫస్ట్ లాన్సర్‌రోడ్ నుండి బంజారాహిల్స్ రోడ్ నం.1 వెంబడి చింతలబస్తీకి డైరెక్ట్ కనెక్టివిటీ ఏర్పాటు చేయడానికి మసాబ్ ట్యాంక్ నుండి సరోజినీదేవి కంటి ఆసుపత్రి దగ్గర NH-65కు ఖైరతాబాద్ వద్ద వయా ఫస్ట్ లాన్సర్ రోడ్, బంజారాహిల్స్ రోడ్ నం.1 మరియు చింతలబస్తీకి ప్రతిపాదిత లింక్ రోడ్ అభివృద్ధికి DPR యొక్క తయారీ కొరకు కన్సల్టెంట్ నియామకం. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ / చివరి తేదీలు & సమయం. ప్రారంభ తేది: 23.07.2025 మ.02.00 గం. చివరి తేది: 06.08.2025 సా.04.00 గం. అధికారి పేరు: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యొక్క కార్యాలయం, ప్రాజెక్ట్ డివిజన్-సెంట్రల్ జోన్, GHMC. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును. సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, (ప్రాజెక్ట్లు-CZ), GHMC
DIPR.No.5306-PP/CL/Advt/1/2025-26, తేది: 19.07.2025



IN THE COURT OF THE HON'BLE I ST SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT HYDERABAD
S.O.P. No. 85 of 2025
Between:
1. T. Lalitha w/o Late T. Dayanand, Age Abt.54, Occupation House Wife, H.No. 3-26,Gandamguda, Peeram cheruvu, Hydershahkote,Hyderabad, Telangan State -500091.
2.T.Sai Baba S/o. Late T. Dayanand, Age Abt.35, Occupation: Pvt Employee, H.No.2-106, Himagiri Nagar Colony, Rajendra Nagar, Gandamguda, K.V. Rangareddy, Telangan State - 500008
3.T.Sagar S/o Late T. Dayanand, Age Abt.34, Occupation: Pvt Employee, H.No. 2-106, Himagiri Nagar Colony, Near Vignan Junior and Degree College, Gandamguda, Peeramcheru, Po. Appa Himayathsagar, K.V. Rangareddy, Telangana -500008.
4. T.Sagarika D/o Late T. Dayanand, Age Abt.33, Occupation: Pvt Employee, H.No. 2-106, Himagiri Nagar Colony, Rajendranagar, Gandamguda Appa Himayathsagar, K.V. Rangareddy, Telangana, 500008.
...Petitioners
AND
1. Canara Bank, Mehdipatnam Branch O/o 10-3-3A, Mehdipatnam, Hyderabad-500 028. Rep. by its Branch Manager
2. All Concerned
.....Respondents
To,
All Concerned (Respondent No.2)
Whereas the Petitioners herein have instituted the above Succession Suit S.O.P No.85 of 2025 for Suit for Grant Succession Certificate, to issue a SUCCESSION CERTIFICATE in favour of the petitioners No.1 to 4 herein in respect of outstanding amount of Rs. 828,020.25/- paise in the credit of SB A/c No. 1369101005235 operated in the 1st Respondent Bank in the name of Late T. Dayanand and the above Suit is posted to 19.09.2025 for appearance of the Respondent No.2. Take notice that, if anybody is/are having objection/s, they may appear before IN THE COURT OF THE HON'BLE I ST SENIOR CIVIL JUDGE,CITY CIVIL COURT AT HYDERABAD,on 19.09.2025at 10:30 a.m. either in person or through a counsel duly instructed, failing which the matter will be decided on merits.
(BY THE ORDER OF THE COURT )
Sd/- VENUGOPALREDDY JAKKIDI
Advocate
H.No:-17-2-258/11,Near Saibaba Temple, Sailalthota,Kurmaguda, Saidabad,Hyderabad,Telangana State.



IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT : AT: MEDCHAL
O.S. No. 225 OF 2025
Between
1. Morry. Sareswathi and Others ...Plaintiffs
And
1. The Tahsildar, Quthbullapur Mandal, Medchal - Malkajgiri District.
2. All concerned. ...Defendants
To
The all Concerned
The above Original Suit has been filed by Morry. Sareswathi and others for Declaration of Legal Heirs against the defendants and the said suit stands posted to 05.08.2025. You i.e., Defendant No.2 are therefore hereby directed to appear before the Hon'ble Court on 05.08.2025 at 10.30 a.m. either in person or through Your Counsel/Advocate, failing which the matter will be decided by the Hon'ble Court in Your absence as per law.
//BY THE ORDER OF THE HON'BLE COURT//
Sd/- M. SAI KUMAR
Advocate
# Flat No.402, Jyothi Homes Apartments, Sriram Nagar, Suraram Village, Quthbullapur Medchal-Malkajgiri Dist-500055.
Mob.No. +91 9030043844



PUBLIC NOTICE
It is hereby informed to the General Public that my client Sri Chikudu Ashok S/o Chikkudu Satthaiah R/o.H.No.2-2-65, Pedda Cherlapally, M.M. District has entered into agreement of sale with Sri Dulam Abhilash S/o Sri Dulam Sampath, R/o. Suraram, Elkathurthi Mandal, Hanmakonda towards purchase open Plot No.16 Southern Part, in Sy.Nos. 216 to 222, adm. 120 square yards, situated at Cherlapally, GHMC, Kapra Circle and Mandal, Medchal Malkajgiri district, and my client has paid substantial amounts as part sale consideration, its bounded as: NORTH: PLOT NO. 16 Northern Part SOUTH : PLOT No. 17. EAST : 33' WIDE ROAD. WEST : PLOT NO.19. In this regard, if any person/persons/ financial institutions/ Bankers/ Public or private organizations, having any objection, right, title or claim over the above immovable property, please contact the undersigned alongwith relevant original documents within (03) days from the date of this publication. Thereafter no claims or objections will be entertained and the same shall be treated as null and void. Hence, this public notice.
Sd/-K. RAVIKANTH
Advocate
H.No.42-819, Opp. HDFC BANK Main Road, Moulali, HYDERABAD-040.
CELL: 9391047141

## బోనాల ఏర్పాట్లపై కార్పొరేటర్ సమీక్ష



**నేరెడ్ మెట్, జూలై 19 (ప్రభాతవార్త):** మల్కాజ్గిరి కార్పొరేటర్ వురవల్లి శ్రవణ్ బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని పలు దేవాలయాల్లో జరుగుతున్న ఏర్పాట్లను అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఓల్డ్ మల్కాజ్గిరి ప్రాంతంలోని పలు కూడళ్లలో డ్రైనేజీ పొంగుతున్న ఘటనలపై వాటర్ వర్క్స్ అధికారులపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా తక్షణమే సమస్యను పరిష్కరించాలని జి.ఎం సునీల్, మేనేజర్ తేజస్వినిలను ఆదేశించారు. పనుల వేగాన్ని పెంచాలని, విఫలమైన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మూడు గుళ్ళ వద్ద ప్యాచ్ వర్క్ పూర్తి కాకపోవడంపై పునఃసమీక్ష జరిపిన ఆయన, పనులు నిలిచిపోవడంపై ప్రశ్నించారు. వెంటనే మరమ్మత్తులు పూర్తిచేయాలని స్పష్టం చేశారు. బోనాల పండుగకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా ఏర్పాట్లు పూర్తవ్వాలని సూచించారు. ఈ తనిఖీల్లో డిప్యూటీ కమిషనర్ సుల్తానా, ఏ ఎమ్ ఓ హెచ్ మంజుల, వాటర్ వర్క్స్ జి.ఎం సునీల్, మేనేజర్ తేజస్విని, నగర పరిపాలన విభాగానికి చెందిన నవీన్, నాగార్జున తదితర అధికారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

-కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ



ముసారాంబాగ్ డివిజన్ లో బోనాల పనులను పరిశీలిస్తున్న కార్పొరేట్ బొక్క భాగ్యలక్ష్మ తదితరులు

**మలక్ పేట, జూలై 19, ప్రభాతవార్త:** అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని ముసారాంబాగ్ డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ పేర్కొన్నారు. డివిజన్ లోని పలు ప్రాంతాలలో చేపడుతున్న బోనాల పండుగ పనులను జిహెచ్ఎంసి అధికారులు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ. 30 లక్షలతో డివిజన్ లో ఆలయాల వద్ద ఇంజనీరింగ్ పనులు, వివిధ రోడ్ల ప్యాచ్ వర్క్, వాల్ పెయింటింగ్ తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిఇ ప్రజ్ఞ, ఏఈ శరత్, సైట్ ఇంజనీర్ ఏడుకొండలు, వర్క్ ఇన్స్పెక్టర్ సత్తిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు అమిత్, ప్రభాకర్, హరి, ప్రశాంత్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి దేవాలయంలో మైనంపల్లి పూజలు



**మల్కాజిగిరి జూలై19, ప్రభాతార్త :** మల్కాజిగిరి మహంకాళి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు గారు బోనాల పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ నాయకులు మల్కాజిగిరి ఇంచార్జీ లక్ష్మీకాంత్ రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బి కే శ్రీనివాస్, చంద్ర శేఖర్, గుండా నిరంజన్, రాందాస్ సంతోష్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షులు సత్యమూర్తి జి డి సంపత్ గౌడ్, వైనాల ప్రవీణ్, వినోద్ యాదవ్, మహేందర్ గౌడ్, నాగేష్ గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జి డి చరణ్ జిత్ గౌడ్, ఇందిరా ప్రియదర్శిని, ప్రభా, కనక లక్ష్మీ, శారద, సనాది శంకర్, కుట్టి శ్రీనివాస్, సందీప్ గౌడ్, వెంకటేశ్వర్ రావు, బ్రహ్మయ్య, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



పాఠశాలలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపల్ నాచం సుధాకర్, కార్పొరేటర్ అలందర్ వాలా జాహి తదితరులు

**మలక్ పేట, జూలై 19, ప్రభాతవార్త:** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ది స్టూడెంట్ సర్వీస్ గిల్డ్ హై స్కూల్ పాఠశాల ప్రిన్సిపల్ నాచం సుధాకర్ పేర్కొన్నారు. చాదర్ ఘాట్ ది స్టూడెంట్ సర్వీస్ గిల్డ్ పాఠశాలలో పాఠశాల ప్రిన్సిపాల్ నాచం సుధాకర్ ఆధ్వర్యంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దారుషిఫా కార్పొరేటర్ అలందర్ వాలా జాహి ముఖ్యఅతిథిగా విచ్చేసి పాఠశాల ప్రిన్సిపాల్ నాచం సుధాకర్, విద్యార్థులతో కలిసి వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు చక్కటి పర్యావరణాన్ని అందించడానికి ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడంతో పర్యావరణ పరిరక్షణ పై విద్యార్థులకు అవగాహన కలుగుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి మొక్కలను నాటి, వాటిని సంరక్షించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ మిస్ట్రస్ బిల్ కిస్ ఫాతిమా, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణి



**సరూర్‌నగర్, జూలై 19 ప్రభాతవార్త:** మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని సిర్లాహిల్స్‌లోనున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్థానిక మాజీ కార్పొరేటర్ పసునూరి బిక్షపతిచారి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ చేతుల మీదుగా పుస్తకాలు, చాక్లెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులకు సన్మానం కూడా చేశారు. ఈ కార్యక్రమంలో కీసర గోవర్ధన్‌రెడ్డి, కోడూరు సోమేశ్వర్, గాజుల మధు, పలువురు మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

# మద్యం సేవించి వాహనాలను నడపరాదు

### - ట్రాఫిక్ అడిషనల్ డిసిపి రామదాసు తేజావత్



మలక్ పేట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రామదాసు తేజావత్, ఇన్ స్పెక్టర్ అశోక్ కుమార్ తదితరులు

**మలక్ పేట ,జూలై 19, ప్రభాతవార్త:** మద్యం సేవించి వాహనాలను నడపరాదని ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రామదాసు తేజావత్, మలక్ పేట్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అశోక్ కుమార్ లు పేర్కొన్నారు. మలక్ పేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యం మత్తులో వాహనాలు నడిపి వాహనదారులపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందని, ప్రతినిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను విస్తృతంగా నిర్వహిస్తామని తెలిపారు. నగర పోలీస్ కమిషనర్ ట్రాఫిక్ కమిషనర్ ఆదేశాల మేరకు రాత్రిపూట మాత్రమే నిర్వహించే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ఇకపై రోజంతా ఏ సమయంలోనైనా నిర్వహించనునట్లు వివరించారు. ఇటీవల కాలంలో మద్యం సేవించి వాహనాలను నడిపే వాహనదారుల కారణంగా జరిగే రోడ్డు ప్రమాదాల లో అమాయక ప్రజలు ప్రాణాలను కోల్పోతున్న ఘటనలు అధికంగా జరుగుతున్నాయని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సంకల్పంతో ఈ కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. ప్రజల సహకారంతోనే ఇటువంటి కార్యక్రమాలు విజయవంతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పగలు రాత్రి అనే భేదం లేకుండా ఎటువంటి సమయాలలోనైన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## బోనాల వేడుకలకు ముస్తాబైన సఫిల్‌గూడ కట్ట మైసమ్మ దేవాలయం

### అలంకారాలతో అద్భుతంగా వెలిగిపోతున్న అమ్మవారి ఆలయం



**నేరెడ్ మెట్, జూలై 19 ప్రభాతవార్త:** ఆదివారం జరిగే బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని మల్కాజ్గిరి నియోజకవర్గంలోని సఫిల్‌గూడ ప్రాంతంలో ఉన్న ప్రసిద్ధ కట్ట మైసమ్మ దేవాలయం రాత్రి వెలుగుల వర్షంలో మెరిసిపోతోంది. ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలతో, రంగురంగుల అలంకారాలతో ప్రత్యేక శోభను పొందింది. భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉండటంతో ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. సెక్యూరిటీ, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, శుచి సమృద్ధి వంటి అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు కలిసి సమన్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కట్ట మైసమ్మ అమ్మవారికి ప్రతీ ఏడాది బోనాల సందర్భంగా జరిగే పూజా కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. ఆలయం ప్రధాన గోపురాన్ని శుభ్రపరిచి, నూతనంగా రంగులతో అందంగా ముస్తాబు చేశారు. గర్భగృహం చుట్టూ పూల తోరణాలు, పటాకులు, కాంతివల్లులు ఏర్పాటు చేసి భక్తుల మనసులను ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ... ఈసారి అమ్మవారికి భారీగా బోనాలు ఎక్కించేందుకు భక్తులు ముందుండగా, అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. శాంతియుతంగా, ఆధ్యాత్మికంగా వేడుకలు జరగాలని ప్రార్థిస్తున్నాం," అని తెలిపారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చే భక్తుల రాకతో సఫిల్‌గూడ ప్రాంతం పండుగ మాహాత్మ్యాన్ని చాటుకుంటోంది. ఆదివారం జరిగే అమ్మవారి బోనం వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి కావడంతో భక్తుల్లో ఉత్సాహం వెల్లివిరుస్తోంది.

## ప్రతిభ గల పేద విద్యార్థులను ప్రోత్సహించాలి : మాజీ మేయర్ పారిజాత





జార్ఖండ్ ధన్‌బాద్ ఐటిలో సీటు సాధించిన పేద విద్యార్థి నవీన్‌కుమార్‌కు ఆర్థిక సాయాన్ని అందించిన మాజీ మేయర్ పారిజాత, న్యూ మాస్టర్ మైండ్స్ కాలేజీ యాజమాన్యం

**సరూర్‌నగర్, జూలై 19 ప్రభాతవార్త:** ప్రతిభ గల పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక సాయం అందించి ప్రోత్సహించాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్, టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. బడంగ్‌పేట్‌లోని న్యూ మాస్టర్ మైండ్స్ కళాశాల అకాడమిక్ అచీవ్‌మెంట్ అవార్డ్స్ -2025 ప్రదానోత్సవ కార్యక్రమం శనివారం జరిగింది. కాలేజీ ఛైర్మన్ డాక్టర్ జగన్మోహన్‌రావు, కార్యదర్శి డాక్టర్ పాండు రమావత్, డైరెక్టర్లు నాగేంద్ర, లక్‌పతిల ఆధ్వర్యంలో బడంగ్‌పేట్‌లోని తిరుమల గార్డెన్స్‌లో కనుల పండువగా జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పారిజాత హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యూ మాస్టర్ మైండ్స్ కాలేజీలో చదువుకొని రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేసి సిఎ ఫౌండేషన్ కోర్సులో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థులను సన్మానించారు. అంతే కాకుండా సిఇసి, ఎంఇసిలలో 90 శాతానికి పైగా మార్కులు సాధించి బికామ్, బిబిఎలో ప్రవేశం పొందిన ఏడుగురు విద్యార్థులకు న్యూ మాస్టర్ మైండ్స్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ తరపున స్పాన్సర్ చేసిన ట్యూషన్ ఫీజు మొత్తాలకు సంబంధించిన చెక్కులను సంబంధిత కాలేజీ సిఇఓకు అందజేశారు. ముఖ్యంగా న్యూ మాస్టర్ మైండ్స్ కాలేజీలో చదువుకొని ప్రతిష్టాత్మక జార్ఖండ్‌లోని ధన్‌బాద్ ఐటిలో ప్రవేశం పొందిన పేద కుటుంబాలకు చెందిన నేనావత్ నవీన్‌కుమార్, సాయికుమార్‌లకు కాలేజీ వారు రూ.10 వేల చొప్పున ప్రత్యేకంగా అందించిన నగదు సాయాన్ని కూడా అందజేశారు. అయితే ఆటో డ్రైవర్‌గా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించే నవీన్‌కుమార్ తండ్రి ప్రమాదంలో చనిపోయిన సంగతిని తెలుసుకున్న మాజీ మేయర్ పారిజాత తన వంతుగా రూ.10 వేల సాయాన్ని వేదికపైనే నవీన్‌కుమార్‌కు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలను పెట్టుకొని వాటిని సాధించే క్రమంలో పై చదువులకు వెళ్తున్న పేద విద్యార్థులకు అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి సంవత్సరం కాలేజీ తరపున ఎంతో మంది పేద విద్యార్థులను ప్రోత్సహిస్తున్న న్యూ మాస్టర్ మైండ్స్ నిర్వాహకులను ఆమె అభినందించారు. విద్యార్థులు కూడా ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ లక్ష్యాల వైపు దూసుకెళ్లాలని ఆమె సూచించారు. సిఎం రేవంత్‌రెడ్డి స్థాపించిన స్కిల్ యూనివర్సిటీ గురించి ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో స్ఫూర్తి గ్రూపు కాలేజీల సిఇఓ హోలీధర్‌రెడ్డి, బడంగ్‌పేట్ మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, న్యూ మాస్టర్ మైండ్స్ కాలేజీ ప్రిన్సిపాల్ నవనీత, శ్రీనివాస్ రెడ్డి, కామర్స్ హెడ్ శ్రీధర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

# చికెన్ షాపు ఎత్తివేయాలని ధర్నా





**నేరెడ్‌మెట్, జూలై 19, ప్రభాతవార్త :** అసోసియేషన్ నిబంధనలకు వ్యతిరేకంగా వెలుస్తున్న చికెన్ షాపు నుతొలగించాలని డిమాండ్ చేస్తూ చికన్ షాప్ అసోసియేషన్ ప్రతినిధులు శనివారం షాప్ ఎదుట ధర్నా నిర్వహించారు . అసోసియేషన్ నిబంధనల ప్రకారం షాపుకి షాపుకి 400 మీటర్స్ దూరం ఉండాలని నిర్ణహించినా , ఓల్డ్ సఫిల్గూడ డీమార్ట్ రోడ్లో కొత్త షాపు ఏర్పాటు చేస్తున్నారనీ షాపును మూసివేయాలని వారు డిమాండ్ చేశారు. అసోసియేషన్ కు విరుద్ధంగా 150 మీటర్ల దూరంలోనే దౌర్జన్యంగా షాపు ఏర్పాటు చేస్తున్నారనీ ఇదేమని అడిగేందుకు వెళ్లిన అసోసియేషన్ పై కేసు పెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. గతంలో స్నేహా, వాన్ కాబ్ వంటి సంస్థలే అసోసియేషన్కు విరుద్ధంగా షాపులు గత సంవత్సరం 2024 స్నేహ గ్రూప్, వెన్కాబ్ గ్రూప్ లాంటి పెద్ద పెద్ద సంస్థలు అసోసియేషన్ నిర్ణయాన్ని కట్టుబడి వెళ్లిపోయాయన్నారు. ఇప్పుడు ఇక్కడ ఏర్పాటు చేసే చికెన్ షాపును తొలగించాలి అసోసియేషన్ నిబంధనల ప్రకారం దూరాన్ని పాటిస్తూ ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ధర్నాలో మల్కాజిగిరి చిక్ షాపు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు విజయ్ కుమార్, ఉపాధ్యక్షులు నరేష్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, ప్రతినిధులు నరేందర్ రెడ్డి, రాజేష్, వెంకటేష్, సత్యనారాయణ రెడ్డి, ఖాసీమ్, రాజమోళి, గోపాల్ నాయక్; ఖన్నా, గౌలికర్ అశోక్, మహేందర్, దినీష్, సాయి, భరత్ తదిరలు పాల్గొన్నారు.

## మామిడిపల్లిలో కబ్జాలపై విచారణ జరిపించి భూములను కాపాడాలి

### మాజీ కార్పొరేటర్ మద్ది సబితా రాజశేఖర్‌రెడ్డి వినతి

**సరూర్‌నగర్, జూలై 19 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలంలోని తమ స్వగ్రామం మామిడిపల్లి గ్రామంలో ప్రభుత్వ భూములు, దేవాలయ భూములు, కుంటలు, స్మశానవాటిక భూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపించి సదరు భూములను కాపాడాలని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 20వ డివిజన్ మాజీ కార్పొరేటర్ మద్ది సబితా రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. అదే విధంగా కబ్జాలకు పాల్పడుతున్న సంస్థలకు సంబంధించిన వ్యక్తుల నుండి తమ కుటుంబానికి ప్రాణహాని ఉన్నదనీ ఈ మేరకు పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మామిడిపల్లి గ్రామ రెవెన్యూ కిందకు వచ్చే మర్రివాని కుంట, హనుమాన్ దేవాలయం భూమి, గ్రామ స్మశానవాటిక స్థలం కబ్జాకు గురైందనీ ప్రైవేటు సంస్థలకు సంబంధించిన కొందరు వ్యక్తులు సదరు భూములను ఆక్రమించుకొని ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని ఆమె వివరించారు. ఈ నేపథ్యంలో తాము జిల్లా కలెక్టర్, కందుకూరు ఆర్డీఓ, బాలాపూర్ ఎమ్మార్వో, ఇరిగేషన్, దేవాదాయ శాఖ అధికారులకు రెండు సార్లు ఫిర్యాదు చేశామని ఆమె వెల్లడించారు. ఈ నేపథ్యంలో తమ కుటుంబానికి బెదిరింపులు కూడా వచ్చాయనీ దీంతో తాము రాచకొండ కమీషనర్‌కు ఫిర్యాదు చేశామని ఆమె తెలిపారు. ఈ మేరకు తాము పేర్కొంటున్న కబ్జాలపై సమగ్ర విచారణ జరిపించాలనీ అదే విధంగా ఆక్రమణలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను కోరారు.

## ఎస్‌బిహెచ్ కాలనీలో రూ.72లక్షల వ్యయంతో రోడ్ల నిర్మాణం



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

**సైదాబాద్, జూలై 19 ప్రభాతవార్త:** లింగోజిగూడ డివిజన్ ఎస్‌బిహెచ్ వెంచర్ 3లో చేపడుతున్న సిసి రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి శనివారం కాలనీ వాసులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నెం.1,2,3, 4,5లలో సుమారు రూ.72 లక్షల వ్యయంతో రోడ్ల నిర్మా ణ పనులు జరుగుతున్నాయని, రోడ్డు నెం.1,2లలో ఇప్ప టికే పనులు పూర్తి కావడం జరిగిం దని, రోడ్డు నెం.3, 4,5లలో కూడా త్వరలోనే పూర్తిఅవుతా యని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు బాలచందర్ గౌడ్, వెంకటరెడ్డి, మధుసూధన్‌రెడ్డి, సురేష్, శ్రీనివాస్, రామోజి తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు పరిశీలించిన మేడ్చల్ అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా



బోడుప్పల్లో ఇందిరమ్మ ఇల్లు పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా, మాజీ మేయర్ అజయ్ యాదవ్, కమిషనర్ శైలజ, మాజీ కార్పొరేటర్లు తదితరులు

**బోడుప్పల్ జూలై 19 ప్రభాతవార్త;** ఇందిరమ్మ ఇళ్ల పరిశీలనలో మేడ్చల్ నియోజకవర్గం, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ 27,28 డివిజన్లో మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్త పర్యటించారు. బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మున్సిపల్ కమీషనర్ శైలజ ,బోడుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి, మేడ్చల్ బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు చీరాల నర్సింహ, బొమ్మక్ కళ్యాణ్, కాంగ్రెస్ నాయకులు రాపోలు ఉపేందర్, తోటకూర రాజు యాదవ్ పాల్గొన్నారు.

## మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకం

**నేరెడ్ మెట్, జూలై 19, ప్రభాతవార్త :** మల్కాజిగిరిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. బండి రాజు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల జూలై 23, 2025 వరకు దరఖాస్తు చేసుకోవచ్చుని సూచించారు. బయోటెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్, కామర్స్, మ్యాథమెటిక్స్, ఇంగ్లీష్, తెలుగు, మైక్రోబయాలజీ, హిస్టరీ, స్టాటిస్టిక్స్. ఖాళీలు ఉన్న సబ్జెక్టుల్లో ఖాళీలున్నాయనీ వీటికి సంబంధిత సబ్జెక్టులో పీజీలో కనీసం 55 మార్కులు సాధించి ఉండాలనీ, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 50శాతం మార్కులు సరిపోతాయని తెలిపారు. పిహెచ్‌డి,ఎన్ఈటి, ఎస్ఎల్ఈటి, ఎస్ఈటి, అర్హతలు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందనీ, డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకులుగా అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు తమ పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తు పత్రాన్ని, సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో కలిపి జూలై 23, సాయంత్రం 5 గంట లలోపు కళాశాలకు అందజేయాలనీ, మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంప్రదించవచ్చున్నారు.

## నేడు ఖిల్లా మైసమ్మ బోనాల ఉత్సవాలు

### - పాల్గొననున్న మంత్రి సీతక్క



మంత్రి సీతక్కకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న చైర్మన్ సురేంద్రకుమార్

**ఎల్.బి.నగర్, జూలై 19 ప్రభాతవార్త:** ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లోని శ్రీఖిల్లామైసమ్మ దేవాలయం బోనాల జాతర మహోత్సవం ఈనెల 20వ తేదీ ఆదివారం నిర్వహిస్తున్నట్లు దేవాలయం చైర్మన్ సురేంద్రకుమార్ తెలిపారు. బోనాల జాతరకు హాజరు కావాలని కోరుతూ రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్కకు దేవాలయం చైర్మన్ కుంచారపు సురేంద్రకుమార్ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20వ తేదీ, 27వ తేదీ, ఆగస్టు మూడవ తేదీన మూడు ఆదివారాలు దేవాలయం వద్ద బోనాల జాతర మహోత్సవం ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఆగస్టు 4వ తేదీన అమ్మవారి ఘటాల ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందని భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి బోనాలు సమర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కార్యనిర్వాహణాధికారి మురళీకృష్ణ, ధర్మకర్తలు తిరుమల వెంకటాచార్యులు, రాజునాయక్, శ్రీశైలం, సందీప్, చిలుకూరి లక్ష్మి, అమృతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యా అందించడం అభినందనీయం



విద్యార్థులకు చెక్కులు వంపిణీ చేస్తున్న విజయరంగా, వరుణ్‌గుప్తా

**ఎల్.బి.నగర్, జూలై 19 ప్రభాతవార్త:** సామాజికంగా వెనుకబడిన విద్యార్థులు తమ విద్యను నిర్భయంగా కొనసాగించేందుకు అద్భుతమైన అవకాశం కలగజేయడం అభినందనీయమని ఎంజెఎఫ్ డిస్టిక్ సెక్రెటరీ డాక్టర్ బి.విజయరంగా, బొగ్గరపు వరుణ్‌గుప్తా పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాదు కోతిపేట ఆధ్వర్యంలో ముత్తూట్ సిఎస్ఆర్ ఫౌండేషన్ మేనేజర్ లక్ష్మీనారాయణ సహకారంతో రూ.40లక్షల విలువైన ఉన్నత విద్యకు మద్దతు ప్రాజెక్ట్ అమలులోకి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి అడలూరి లక్ష్మణ్‌కుమార్ పాల్గొని విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాజెక్ట్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రబుత్వ మెడికల్, ఇంజినీరింగ్, నర్సింగ్ కళాశాలల్లో మెరిట్ ద్వారా ప్రవేశం పొందిన విద్యార్థులకు పూర్తి కోర్సు పూర్తి అయ్యేంతవరకు పూర్తిస్థాయి ఫీజు మద్దతు ఇస్తారని తెలిపారు. 21మంది విద్యార్థులను లబ్ధిదారులుగా ఎంపిక య్యారని తెలిపారు. 10మంది ఎంబిబిఎస్, 10మంది ఇంజినీరింగ్, నర్సింగ్ విద్యార్థి ఎంపికయ్యారని ఎంపిక చేశారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బెల్లం మాధవి, ఎస్.కృష్ణమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## లోకాయుక్త కాలనీ ముఖద్వారం ప్రారంభం

**సరూర్‌నగర్, జూలై 19 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని లోకాయుక్త కాలనీలో నూతనంగా నిర్మించిన కాలనీ ముఖ ద్వారం (కమాన్) శనివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కాలనీవాసులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ పార్టీ ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ కార్యక్రమానికి హాజరైన కార్పొరేషన్ మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, నాదర్‌గుల్ మాజీ సర్పంచ్ రామోజీ శ్రీశైలంచారి, బడంగ్‌పేట్ మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, పలువురు నాయకులు, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణారెడ్డి, శివకుమార్, గిరి ముదిరాజ్, కాలనీ అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.



కాలనీ కమాన్‌ను ప్రారంభిస్తున్న అందెల శ్రీరాములు యాదవ్

## తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయ పండుగలపై అవగాహన ఉండాలి



లార్డ్స్ పాఠశాలలో పోతరాజుల వేషాలతో సందడి చేస్తున్న బాలురు

**సరూర్‌నగర్, జూలై 19 ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని లార్డ్స్ విద్యా సంస్థల ఛైర్మన్ సిద్దాల బీరప్ప, వైస్ ప్రిన్సిపాల్ బెర్లు శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు. బాలాపూర్ మండలంలోని జిల్లెలగూడ, బడంగ్‌పేట్‌లలోనున్న లార్డ్స్ పాఠశాలలో శనివారం బోనాల సంబరాలను కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలను వేప, మామిడికొమ్మలతో అలంకరించి ముస్తాబు చేయగా విద్యార్థినీ విద్యార్థులు అమ్మవార్లు, పోతరాజుల వేషధారణలతో అలరించారు. ఈ సందర్భంగా ఛైర్మన్, వైస్ ఛైర్మన్లు సాంప్రదాయబద్ధంగా బోనాలను ఎత్తించారు. అనంతరం వారు మాట్లాడుతూ బోనాల తెలంగాణ పండుగల్లో విశిష్టమైనదని అన్నారు. సంబరాల్లో భాగంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపంలో అమ్మవార్లకు బోనాల సమర్పించారు. ఈ కార్యక్రమాల్లో డైరెక్టర్ సిద్దాల శ్రీలత, డీన్ సతీష్, జిల్లెలగూడ ప్రధానోపాధ్యాయుడు ఎంఎల్ మరియన్, బడంగ్‌పేట్ ప్రిన్సిపాల్స్ రామిడి సంతోష్, భానూరి శ్రీనివాస్‌రెడ్డి, ఇంఛార్జి రేఖాసాగర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కనుల పండువగా బోనాల సంబరాలు



మీర్‌పేట్ బురుజు మైసమ్మ వద్ద నారాయణ స్కూల్ విద్యార్థుల బోనాల సందడి

**సరూర్‌నగర్, జూలై 19 ప్రభాతవార్త:** మీర్‌పేట్‌లోని నారాయణ ఐఐటి ఒలంపియాడ్ పాఠశాలలో శనివారం బోనాల సంబరాలు కనుల పండువగా జరిగాయి. పాఠశాల ప్రిన్సిపాల్ బాబ్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోనాల ఉత్సవాలకు నారాయణ డిజిఎం గోపాల్‌రెడ్డి, ఎజిఎం రవీంద్రబాబులు హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు. బోనాల సంబరాల్లో భాగంగా విద్యార్థులు పోతరాజుల వేషధారణలతో, విద్యార్థినిలు బోనం కుండలను ఎత్తి సందడి చేశారు. అనంతరం మీర్‌పేట్ పాత గ్రామం బురుజు మైసమ్మ అమ్మవారికి సాంప్రదాయబద్ధంగా బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎడి రాజేందర్, ఎఓ మాధవి ఇ-కిడ్స్ అండ్ అందన డి మీన, కో-ఆర్డినేటర్ ప్రియాంక, వైస్ ప్రిన్సిపాల్స్ ధరణి, అనూషరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం



జిమ్‌ను ప్రారంభిస్తున్న అరుణసురేందర్‌యాదవ్

**ఎల్.బి.నగర్, జూలై 19 ప్రభాతవార్త:** ప్రతిరోజు వ్యాయామం చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటామని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణసురేందర్‌యాదవ్ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోని మమత నగర్ రోడ్డు నెంబర్ 1/ఇ లో రూ.10 లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన ఓపెన్ జిమ్మును నాగోల్ సిఐ సూర్యనాయక్‌తో కలిసి కార్పొరేటర్ అరుణ ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దైనందిన జీవితంలో శారీరకంగా మానసికంగా చురుగ్గా ఉండేందుకు ప్రతిరోజు వ్యాయామం తప్పనిసరి అన్నారు. అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మానసికంగా, శారీరకంగా ఉల్లాసంగా ఉండేందుకు ప్రతి ఒక్కరు కసరత్తులు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు శ్రీధర్, వైస్‌ప్రెసిడెంట్ ప్రభావతి, జనరల్‌సెక్రెటరీ సురేఖ, సభ్యులు శ్రీనివాస్, రామునోహన్, కార్తీక్, మహేష్‌శెట్టి, శ్రీలత, శ్రీనివాస్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసుల వినతి



సుధీర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీవాసులు

**ఎల్.బి.నగర్, జూలై 19 ప్రభాతవార్త:** డివిజన్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని నాగోల్ డివిజన్ విజయగార్డెన్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. వరదనీరు పోవడానికి డ్రైన్ ఏర్పాటు చేయాలని కోరారు. నూతన డ్రైన్స్‌తో పాటు రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. అక్కడక్కడ నీరు నిలుస్తుందని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీ సమస్యలు పరిశీలించి త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ భారస అధ్యక్షులు తూర్పాటి చిరంజీవి, కాలనీ అధ్యక్షులు మోహన్‌రెడ్డి, సెక్రటరీ మల్లారెడ్డి, నర్సింహచారి, రాజేశ్వర్, సూర్యనారాయణరెడ్డి, అనంతశర్మ, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.